# "ప్రేమించని మనసులు"

★

శ్రీమతి కే. ఎస్. అచ్యుతవల్లి

"మీ వదినేం చేస్తోందీ ?"

త్రుళ్ళి పడింది సుభద్ర. ఆశ్చర్యంగా అన్నయ్య వేపు చూసింది. పద్మనాభం తనలో తను నవ్వుకున్నాడు.

"నిన్నే ! మీ వదినగారు ఏమిచేస్తున్నారంటే మాట్లాడవేం ?" మళ్ళీ రెట్టించాడు.

సుభద్ర జడకి రిబ్బను ముడెట్టుకోవటం మర్చిపోయింది. జడంతా వదులు బారింది. మళ్ళీ జడని భుజం మీంచి ముందుకు లాగుకుని బిగుతుగా అల్లుకుంటూ,

"నాకు నమ్మకం కలగటంలేదు."

తనలో తనుగా అనుకుంది.

"పోనీ ఇదిచెప్పు ! అమ్మ ఏం చేస్తోందీ ?" ఇంకా నవ్వుకుంటూ "బర్కిల్ల" వెలిగించాడు.

"అమ్మ పూజలో ఉందిరా అన్నాయ్ ! ఎవర్ని పిలవను ?" ఇప్పటికి తేరుకుంది. సుభద్ర.

"ఇప్పుడు పిలవక్కర్లేదు కానీ, సాయంత్రం షికారుకు రెడీగా ఉండమన్నానని చెప్పు."

అతను సిగరెట్ పూర్తి చేయకుండానే, కారు హారన్ మ్రోగింది. సిగరెట్ "అష్ ట్రే"లో పడేసి ఒక చేతికి కోటు తొడుక్కుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

సుభద్ర గాలిలో తేలిపోతోంది. ఆమె మనసు అన్నయ్యతో బోలెడన్ని కబుర్లు చెప్పుకోవాలని తహతహలాడుతోంది. మళ్ళీ మునపటిలా అన్నయ్య ఉత్సాహంగా ఉండటం ఆ భగినికి ఆనంద ప్రదమయిన విషయం. పెళ్ళయిన రెండు సంవత్సరాలకి, అన్నయ్య వదినని గూర్చి అడగటం, నవ్వుతూ కన్పించటంతో ఆమె మనస్సు పరుగెట్టుతోన్నా, అన్న అనుజ్ఞ కోసం శరీరాన్ని నిలబెట్టింది. అన్నయ్య వెళ్ళిపోగానే పరుగు కాని నడకతో తల్లిగదిలోనికి వెళ్ళింది. శారదమ్మ ఇంకా జపంలోనే ఉంది. సుభద్రకి కోపం వచ్చింది. గబగబా 'కిచెన్' లోనికి వెళ్ళింది. నాగమణి కూరలబుట్ట ముందేసుకుని కూర్చుంది. నాగమణిని చూడగానే సుభద్రలోని ఉత్సాహం ఉరకలెత్తి పరుగులెట్టసాగింది.

"వదినా ! నాకేం బహుమాన మిస్తావ్ !" అంది.

"నీ కేదికావాలంటే అదే !" అరటి కాయలు చెక్కు తీస్తూ అన్నది నాగమణి.

"ఆమె అడగటం బాగుంది. మీరిస్తా ననటం బాగుంది. కారణం ఏమిటో కనుక్కోకుండానే ఇచ్చేస్తారా బహుమతులా ?" అన్నాడు అయ్యరు.

"సరే ! కారణం చెప్తే దాని "మజా" "ఉడ్జా" అయిపోదూ !"

"చెప్తేకాని ఇవ్వనివ్వను ! మణమ్మా ! ఇస్తే నేను మీతో మాట్లాడేదిలేదు." అన్నాడు అయ్యరు.

"బహుమానం ఏం కావాలో తెలియందే ఎలా ఇచ్చేది?" అంది నాగమణి.

"సరేకాని ఇవ్వాళ "సాదం"లోకి ఏం చేస్తున్నారు ?"

"అరటికాయ వేపుడు, దోసకాయ పచ్చడి, మోర్ కొళంబు, రసం."

"ఆగండి. ఇవ్వాళ, "మెనూ" మార్చాలి."

"ఏం కథ !" నాగమణి అడిగింది.

"నీ కథ నాకు తెలుసోయ్ ! ఇవ్వాళ, కాబేజీ బటాణీలా కాంబినేషన్‌తో కూర, కొబ్బరి పెరుగు పచ్చడి, సగ్గుబియ్యం వడియాలూ, ములక్కాడ సాంబారూ చేయించు. ఇది మదీయ అనుజ్ఞ." ఉషారుగా అన్నది సుభద్ర.

నాగమణికి అర్థంకాలేదు. ఇవ్వాళ సుభద్ర పుట్టిన రోజుకాదు. ఆయనకి ఇల్లాంటి పండగలూ, వేడుకలూ లేనే లేవు.

"అయితే ఈ తరిగిన వన్నీ ఏం చేయమంటావు ?"

"ఆవుకి పెట్టెయ్యి ! ఆ మాత్రం తెలీదా పెద్ద ఎం. ఎ. ప్యాసయినావు మళ్ళీ !"

నాగమణి మాట్లాడకుండా "కాబేజి" కత్తిపీట ముందేసుకుని కూర్చుంది. ఆమె సాధారణంగా అత్తగారి తోనూ, ఆడబిడ్డతోనూ ఎక్కువ మాట్లాడదు. సుభద్ర లాంటి చలాకీ పిల్ల కూడా, ఆమెని గంటసేపు ప్రశ్నలతో విసిగిస్తే, సమాధానం కొద్ది మాటలతో రాబట్టుకో గలుగు తుంది. ఇప్పుడు సుభద్ర సంతోషం సముద్రమంతటి దైంది. ఏదో మాట్లాడకుండా ఉంటే, ఆమెలో పొంగుతున్న తరంగాల ఉద్వృతం ఎల్లా నిర్గతమవుతుంది !

"అయ్యరుజీ ! నెలకీ నలభయ్ రూపాయలు లాగుతున్నావు కదా ? కూరలు ఒకళ్లు తరిగిపెడితేనే కాని వంట చేయ లేవా ? నీ జీతంలో సగం వదినకిచ్చేస్తావా మరి ?"

అయ్యరు ఆ ఇంట్లో శారదమ్మ కాపరాని కొచ్చిన నాటి నుండీ ఉన్నాడు. పద్మనాభాన్నీ, సుభద్రనీ కూడా ఆయన చేతుల్లో ఆడిస్తూ పెంచుకొచ్చాడు. జాబిల్లిని చూపిస్తూ వాళ్ల చేత పెరుగన్నం తినిపించేడు. అంచేత ఆయ నకి సుభద్ర మాటలకి కోపంరాదు.

"ఏం చేసేదమ్మాయ్ ! పెద్దవాణ్నయిపోతిని గదా ? ఏదో ఇంటి కోడలు కనుక సాయం వస్తుంది. అదే ఇంటల్లుడు సాయితా వస్తాడా ? మీ అమ్మయితే అసలు వంటింటి ముఖమే చూసేదికాదు. నాగమణి సౌమ్యతగల పిల్లది కనుక నాకు సాయితా వస్తోంది. ఇల్లాంటివాడే నీ భర్త అయితే నా కింక దిగులుండదు. ఇద్దరూ చెరోవనీ చేసుకపోతారు." నవ్వుతూ అన్నాడు. అయ్యరు.

"ఓయబ్బ ! ఎంత దురాశ పంతులికీ ! నీకు కూరలు తరిగే వాణ్నే, పచ్చళ్లు రుబ్బిపెట్టేవాణ్నే నేను పెళ్లాడాలా !"

ఆ ఉత్సాహంలో ఆమె ఇంకో మాట జారింది.

"ఈవిడ కనుక, నీ మీద జాలితలుస్తున్నది కాని, అదే సంధ్యేనా, లలితేనా అయితే, తెలిసొచ్చేది. అయ్యరుజీ పాక శాస్త్రప్రవీణత ఎంతవరకో,"

నాగమణి తలవంచుకుంది. కారణం ఆమెకళ్లు నిండు కుంటున్నాయ్. ఆమె చేతులు తొందరగా కాబేజిని తరుక్కు పోతున్నాయ్. తన వాళ్లందరూ, తనను, "అవాంఛితంగా, వరిం చిన అదృష దేవత, పద్మనాభం," అని అనుకుంటున్నారు. కాని ఆ దేవత ప్రసన్న దృష్టే తనకు కరువని తనకీ, ఈఇంటి లోని జనానికీ తప్ప ఇంకెవరికీ తెలీదు. ఇందరి రాజకుమార్తెల కలల్లోని రాజకుమారుడు, తనకి నిక్షిప్తధనంలా లభ్య మవటం, తన అదృష్టమో, దురదృష్టమో తెలుసు కోవాలన్న తహహతోనే ఆమె రోజులన్ని నిర్మోహంతో గడుపు తోంది.

"ఎవర్నేనా లొంగతీద్దునులేమ్మా ! ఈ ముసలాడు కష్టపడుతూంటే చూసి వూరుకోగల్గేంత కఠినత్వం, మీ ఆడ పిల్లలకి రాదులేతల్లీ !"

"నేను లేనూ ?"

"నువ్వయినా, వదినమ్మ నర్దుకు పోతున్నది కదా అని ఊరుకున్నావు కాని, లేకపోతే, ఎడంచేయికన్నీ సాయితా రాకుండా ఉండకలవా ?"

ఇద్దరూ వాదంవేసుక కూర్చున్నారు. నాగమణి కూరలు తరగడం పూర్తి చేసింది. కొబ్బరి కోరిఇచ్చింది. వెండిగ్లాసు లోకి, పాలువొంపి "గ్లూకోజ్" కలిపి అత్తగారి గదిలోనికి వెళ్ళింది. శారదమ్మ పూజ, జపం పూర్తయింది. రామా యణం ముందేసుకుకూర్చుంది. నాగమణి చేతుల్లోని గ్లాసందు కున్నది. ఇంతలో అక్కడికి, సుభద్ర వచ్చింది.

"అమ్మా ! గుడ్ న్యూస్ !"

"ఏమిటమ్మా !" అన్నది. శారదమ్మ ఆశ్చర్యంగా.

"ఏ మిస్తావు నాకు ?"

"ఏది కావాలంటే అదే !"

"చచ్చాంపో ! ఈ ఇంటి కోడళ్లంతా దానకర్ణులన్న మాట."

"ఇంటి ఆడపచులంతా, పేదవారులైతే మేము దాన కర్ణులవక తప్పుతుందిటే భద్రీ !"

"అసలు సంగతి అడగవేం మరీ !"

"నువ్వే చెప్పుతావు. అడిగేదాకా ఊరుకుంటావు కనుకనా"

పాలుత్రాగటం పూర్తయింది. నాగమణి చెంగున కట్టుకున్న రెండు లవంగాలు అత్తగారికిచ్చి పాలగ్లాసు చేతులో పుచ్చుకుని నిలబడింది.

"ఇక్కడేం పనీ నీకు ?" మణిని కవ్విస్తూ అంది సుభద్ర. నాగమణి నవ్వి ఊరుకుంది. విషయ గ్రహణాసక్తి కన్పడింది ఆమె ముఖముద్రలో.

"అదుంటే ఏం పోయింది ! ఏమిటో చెప్పు నీ సొద!"

"నా సొద ఆవిడుంటే ఎల్లా చెప్పేదమ్మా !"

నాగమణి అవతలికి వెళ్లబోయింది. శారదమ్మగారికి సుభద్ర తీరు నచ్చలేదు.

"పోబోకు మణీ ! ఏమిటే భద్రీ ! దీన్ని అల్లా అనొచ్చా తప్పుకాదూ ?" మందలించింది శారదమ్మ.

"తప్పొప్పుల సవరణ పట్టిక, ఆఖరు పేజీలలో వేయి ద్దాం. కానీ, ముందు వదినా ! ప్లీజ్ ! గోయవే !" వినతిగా ముఖంపెట్టి అంది. నాగమణి వెళ్లబోయి వరండాలో గోడ కానుకుని, నిలబడింది. కానీ ఆమె సంస్కార యుతమైన మనసు సిగ్గుపడింది. తనేం చేస్తున్నదీ ! తల్లీ కూతుళ్ల మధ్య ఏదైనా సంగతులుంటాయ్. తను చాటుగా వింటం తప్పుకాదూ ? కదలబోయిన కాళ్లు భద్ర మాటలకి ఆగేయ్. "అమ్మా ! నిజం. వదిన్ని అన్నయ్య అడిగాడు." అమిత సంతోషంవల్ల సుభద్రకి అంతకంటె మాటలు రాలేదు.

“ఏమన్నాడు, నిజం ?” మళ్ళీ మళ్ళీ కూతురునోట ఆ సంతోషకరమైన సంగతి వినాలన్న ఉత్సుకత ధ్వనించింది శారదమ్మ గొంతులో.

“వదిన్ని సాయంకాలం షికారుకు పోవటానికి రెడీగా ఉండమని చెప్పమన్నాడు !”

అమ్మయ్య ! ఇప్పటికి సుభద్ర సంతోష సాగరానికి ప్రాజక్టు కటింది. ఇంక ఆ సాగరం తేనెవాగులై, నాగమణి శారదమ్మల హృదయాలని పరితృప్తం చేయాలి.

“చెప్పక పోయావ్ దానితో ! పిచ్చిపిల్లా ! ఉట్టి హడావుడి రాయుడివే ! ఎల్లా వేగుతాడో రామం, రేప్రొద్దుటి!”

“ఫో అమ్మా ! వదిన దగ్గర ప్రైజ్ లాగొద్దేం ?”

“వాళ్ళిద్దరూ కలకల్లాడుతూ కన్పించటం కన్న మనకు కావల్సిన ప్రైజులేమిటే తల్లీ ! భగవంతుడు దాని సహనాన్ని పరీక్ష చేశాడు ఇన్నిరోజులూ.” శారదమ్మ కళ్ళు ఆనందంగా చమరించినాయ్. కళ్ళజోడు తీసి చెంగుతో తుడుచుకుని మళ్ళీ పెట్టుకొంది ఆమె.

నాగమణి కాళ్ళు అక్కడ నిలవలేదు. మేడమీదకు పోయి తన గదిలో తలుపులేసుకుని కిటికీలో కూర్చుంది. తోటలోని రకరకాల పూవులు, వింత సువాసనలను వెద జల్లుతూ చిరుగాలికి తలలూపుతున్నాయ్. విరిసిన పూవుల మురిపాల ముచ్చట్లు తల్లి ఆకులు చెవులొగ్గి వింటున్నాయ్. తుమ్మెదలూ, సీతాకోక చిలుకలూ, ప్రతీ పూవు ఆహ్వానాన్ని అందుకున్నాయి. మత్తెక్కి జోగుతూ సంగీతాలు పాడుతున్నాయి. వాటి సంగీతానికి తోటగట్లమీద సరుగుడు చెట్లు శ్రుతి వేస్తున్నాయి. దూరంగా ఇనుపస్తంభాల ఆర్చీమీదున్న సంపంగి పొదలోని చంపకాలు తమ శక్తి వంచన లేకుండా సువాసనలు వెదజల్లుతున్నా, తుమ్మెదలు కానీ, సీతాకోక చిలుకలుకానీ, వాటి హృదయపూర్వక నిమంత్రణాన్ని అందుకోలేక పోతున్నాయి. నాగమణి “చలిత చంపకం” యొక్క మూగ వేదనని పరీక్షిస్తూ కూర్చున్నది. “హృదయ మాత్ర సౌందర్యం అనాకర్షితం అని చంపక పుష్పం రుజువు పరుస్తున్నది. తుమ్మెదల క్కావల్సిన మధువు కానీ, సీతాకోక చిలుకలని మురిపించగల వన్నెల రంగుల రేకలు కానీ చంపక పుష్పం సంతరించుకోలేదు. ఆ పుష్ప జీవితం ఒకే రంగులోకల నిసర్గ సౌందర్యంతో, ఒకే ఒక అనుభూతితో పరి పూర్తవుతున్నది,” అనుకున్నది నాగమణి. ఇంతలో సుభద్ర తలుపులు దబాదబా బాదింది. నాగమణి కాళ్ళు దడదడలాడాయ్. గుండెల్లో ఏదో బరువుగా దిగులు, గుబులుగా మొదలైంది. నెమ్మదిగా లేచి తలుపు తీసింది.

“భోజనానికి గంటనించీ పిలుస్తుంటే తలుపులు బిగించుకుని ఏం చేస్తున్నావ్ ?”

“అమ్మయ్య !” అనుకున్నది నాగమణి. సుభద్రని అనుసరించింది. ఇందాకటి ప్రశంస ఏమన్నా వినవలసి వస్తుందేమో, అని భయపడిన నాగమణికి అభయం సంప్రాప్తించింది. భోజనాల హాలు వేపు వెళ్ళారు. తల్లీ కొడుకూ కబుర్లు చెప్పుకుంటూ, భోజనాలు చేస్తున్నారు. నాగమణి చుట్టూ వసారాలోంచి వెళ్లి వంటింట్లో నిలబడింది. సుభద్ర వెళ్లి తల్లిప్రక్క నున్న విస్తరిలో కూర్చుంది. శారదమ్మగారు తలెత్తి వంటింటి గుమ్మంలోకి చూసింది. కోడలి, చీరకుచ్చెళ్ళు కనపడ్డాయ్.

“మణీ ! నువ్వుకూడా భోజనానికి దామ్మా ! ఆలస్యం అయిపోతూంది.” సాదరంగా పిల్చింది. మణి హాలులోకి తొంగి చూసింది. పద్మనాభం తలొంచుకు భోజనం చేస్తున్నాడు. పచ్చని విశాలమైన అతనివీపుమీద స్ఫటికాల్లాంటి చమట బిందువులు ఉత్పన్నమయి వెన్నుపూసమీదుగా నడుంమీదికి జారుతున్నాయ్.

అయ్యరు ఈ రోజు అత్యాశ్చర్యకరమైన సంగతి కంటున్నాడు. ఇన్నిరోజులూ తల్లీ కొడుకూ భోజనాలు చేస్తున్నంతసేపూ, మణి మేడపైనే ఉండిపోయేది. వారిద్దరి భోజనాలు అయినాక సుభద్ర, మణిని పిల్చుకొనివచ్చి, ఇద్దరూ కలిసి భోజనం చేసేవారు.

“కూర్చోమ్మా ! వడ్డించేస్తాను.” అన్నాడు అయ్యరు. మణి నెమ్మదిగావచ్చి సుభద్ర ప్రక్కన తలొంచుకు కూర్చుంది.. పద్మనాభం భోజనం పూర్తయింది. మణిముఖం ఎల్లాగున్నదో చూడాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు పద్మనాభం. ఉత్తరాపాసనపట్టి లేవబోతూ, “సాయంత్రం బయటికి వెళ్దాం. రెడీగా ఉండు.” అన్నాడు. నాగమణి ఉలకలేదు పలకలేదు. తలెత్తి చూడలేదు. స్థాణువల్లె కూర్చుండిపోయింది. శారదమ్మ, సుభద్ర ఆనంద లహరులలో తేలిపోతున్నారు. పెళ్లయిన రెండేళ్లకి కొడుకు నోటమ్మట భార్యని పలుకరించగా విన్నది. మగవాళ్ల ఇష్టాయిష్టాలు ఎప్పుడు ఎల్లా మారుతయ్యో ఎవ్వరికి విశదమవుతుంది ?

నాగమణికి భోజనం సయించలేదు. అది అమితానందోద్వేగం వల్లనో, లేక, మితిలేని సంశయాలలో చిక్కుకొన్నందువల్లనో, ఆమెకి తెలియలేదు. వంటింటి పనులు పూర్తయ్యా అవగానే ఆమె మళ్ళీ తన గదిలోనికి పోయి కూర్చుంది. ఆమె ప్లాస్టిక్ పూసలతో “తాజ్ మహల్” డిజైన్‌తో, హాండ్‌బాగ్ అల్లుకుంటున్నది. ఇవ్వాళ కూడా పూసలు ముందేసుకుని అల్లుకుంటూ కూర్చుంది. గడియారం మూడు కొట్టేసరికల్లా సన్నజాజుల చెండును చేతులో పట్టుకుని సుభద్ర వచ్చింది.

“లేవమ్మా ! ఇంక సింగారం మొదలెట్టు ! ఆలస్యం అయితే, దేవర చిత్తం దేవిడీ పాలుకావచ్చును.” వదినగార్ని చేతులు పుచ్చుకుని లేవదీసింది. బ్యాగూ, పూసలు, పూలచెండూ, మేజామీద పడేసింది. బీరువాతీసి చీరలన్నీ మంచంమీద ఒక్కొక్కటిగా విప్పిపెట్టింది. నాగమణి ఆమె హడావుడి

అంతా నిర్లిప్తతగా చూస్తూ నుంచుంది. సుభద్ర వదినని చూసి.

"ఓ ! బ్రతివాలాలా నిన్ను ?" నవ్వింది. ఇంతలో శారదమ్మ పైకి వచ్చింది.

"ఏమ్మా ! అల్లానే ఉన్నావ్ ! అబ్బాయొచ్చే వేళయి పోవటంలేదూ ?" ఆదరంగా అన్నది.

నాగమణిలేచి జుట్టు విప్పుకున్నది. తలంతా దువ్వుకొని గట్టిగా బిగించి మేడమీదకు వచ్చేలా ముడేసుకున్నది. పిన్నులు గుచ్చేలోపున సుభద్ర జాజుల చెండును సిగమీద అర్థ చంద్రాకారంగా అమర్చి పిన్నులు పెట్టింది. నాగమణి మంచంమీద కుప్పగా పడున్న చీరలకేసి చూసేసరికి నవ్వాగలేదు. ఎన్ని జన్మల తపస్సుల వర ప్రభావమో, ఈ జన్మలో ఇంతటి ఆదరణ చూపే అత్తాడబిడ్డలు లభ్యంకావటం అనుకున్నది నాగమణి. ఈ రెండు సంవత్సరాలలోనూ, సుభద్రకీ, నాగమణికీ, బంధుత్వబంధనకంటె, స్నేహశీలతే దృఢతర బంధ మయ్యింది. బంధువుల్లో స్నేహశీలత లభించటం స్త్రీలకి భగవంతుడిచ్చిన అమూల్య ప్రసాదం.

"ఏమిటి భద్రా ! ఆ చీరలన్ని విప్పిపెట్టే వెందుకు ?" తెలియనిదానిలా అడిగింది.

"కూచమ్మె ! ఏం తెలియదు. ఇవ్వాళ నాకోసం పెళ్లివారొస్తున్నారు, అందుకని." దానిమ్మపండు విచ్చినట్లు నవ్వింది సుభద్ర.

"అల్లా అయితే నా కెందుకీ సింగారం?"మణి ప్రశ్నతో నిలవేసా ననుకుంది భద్రని.

"మా వదిన కూడా, నాకు తగినది అని తెలీవద్దూ ?" వాకిట్లో కారుహారన్ మ్రోగింది.

"గమ్మున తెములు. అన్నయ్యొచ్చేశాడు. "టీ" ఇచ్చేసి వస్తాను." క్రిందికి ఒక్క పరుగులో వెళ్లిపోయింది సుభద్ర. నాగమణి అద్దంలోకి చూసుకుంది. పల్చని ఆమె చెక్కిళ్ళు తెల్లగా పాలిపోయాయ్. సన్నని కళ్ళ చీలికల్లో అగాధాల చీకటి నీ డ లు తారట్లాడుతున్నాయ్. దోసెడు వెడల్పున ఎర్రటి అంచుగల తెల్లని గ్లాస్కో చీరతీసి ధరించింది. మోచేతులవరకూ, మెత్తగా అంటిపెట్టుకుని జారుతున్న తెల్లని జార్జెట్ చోలీ వేసుకుంది. తీర్చి దిద్దినట్లున్న రెండు కనుబొమ్మల మధ్యగా ఆవగింజంత తిలకం దిద్దుకున్నది. ఎందుకనో ఆమె హృదయం ఒక్కసారి అదిరి పడింది. నెమ్మదిగా మేడమెట్లుదిగి ఆఖరి మెట్టుమీద నించుంది. హాలులో సుభద్ర శారదమ్మ, పద్మనాభం "టీ" తీసుకుంటున్నారు.

"దామ్మా ! "టీ" తీసుకుందువుగాని." అంది శారదమ్మ. పద్మనాభం తలెత్తి భార్యవైపు చూశాడు. అప్రయత్నంగా, మణికూడా అతని వేపుచూసింది. వెంటనే తల దించుకుని అత్తగారి ప్రక్కనున్న సోఫాలో కూర్చుంది. అయ్యరు "ట్రే"తో "టీ" బిస్కట్సూ పట్టుకొచ్చాడు. మణి "టీ" కప్పు మాత్రం తీసుకుని టీ త్రాగి మళ్లీ కప్పు సాసరులో పెట్టి ట్రేలో పెట్టేసింది. పద్మనాభం లేచాడు.

"ఇంక వెళ్దాం— అమ్మా !" అన్నాడు.

"పదండి" అంది శారదమ్మ.

నాగమణి లేచి నించుంది. తొలిసారిగా భర్తవెనకా తల నడిచింది. పద్మనాభం అంత పొడుగ్గా ఉన్నది నాగమణి. పెళ్లినాడు పచ్చగా, దృఢంగా కలకల్లాడుతూ ఉండేది నాగమణి. ఇప్పుడు, సన్నగా, తెల్లగా, నిస్తేజంగా ఉన్నది. శారదమ్మ హృదయ పూర్వకంగా ఆశీర్వదించింది. వాళ్లని. రెండేళ్లక్రితం, ఇద్దరి చెంగూ, చెంగూ, ముడెట్టి అగ్నిహోత్రం చుట్టూ ప్రదక్షిణ చేయించినప్పటి దృశ్యం శారదమ్మ మనో యవనికమీద మెరసింది. ఆ హైందవ వివాహ ధర్మంలో కల పవిత్రతవల్లే భార్యా భర్తల అనురాగం వర్ధిల్లు తుందని ఆమె దృఢ విశ్వాసం. ఆ విశ్వాసం సడలిపోతుందేమో అని ఆమె భయాందోళనలతో తపిస్తున్నప్పుడే, ఈ చల్లని వెన్నెల చిలుకుల్లాంటి సంఘటన జరిగింది. దానితో ఆమె విశ్వాసం పటిష్టమైంది. దానిని ఇక ముందు జరుగబోయే ఎల్లాంటి సంఘటనలూ కూడా చలింపచేయలేవు !

పద్మనాభం మాట్లాడకుండా కారుని కొండమీదకి పోనిచ్చాడు. "యలి రాజనందనవనం" దగ్గిర ఆపాడు. నాగమణి మౌనంగా దిగింది. పద్మనాభం ఆ తోట వెనకాతలికి దారితీసాడు. నాగమణి అనుసరించింది. అక్కడ, ఒక నాలుగు స్తంభాల మంటపం ఉన్నది. ఆ మంటపంలో ఒక గంట వ్రేలాడ గట్టబడి ఉన్నది. దాని వెనకాతల అయిదారు గజాల మేర చప్టాలా ఉంటుంది. దానికి చుట్టూరా చిన్న పిట్టగోడ కట్టివుంది. దానిప్రక్క నుంచి కొండమీదికి ఏటవాలుగా మెట్లు ఉన్నాయి. అక్కడక్కడా కాలిదారికూడా ఉన్నది. అది చంద్రగిరికి పోతుంది. ఎగువ తిరుపతికి పళ్ళు, కూరలు, పెరుగూ చంద్రగిరి వాళ్లు ఆ దారమ్మటే తెస్తారు. పద్మనాభం నాగమణి వేపు దీర్ఘంగా చూశాడు. ఆమె పిట్టగోడ కానుకుని ఎదుటి లోయలోనికి చూస్తున్నది. లోయని అంతా సూర్యాస్తమయ కాంతి ఎర్రగా మండిస్తున్నది. ప్రక్క కొండల దుబ్బులమీది నక్షత్రం పూవులు నవ్వుతున్నాయి. నాగమణి తల్లోని సన్నజాజులు నక్షత్ర పువ్వుల హసిత వదనాల్ని కళ్లు విప్పి చూస్తున్నాయి.

"ఇక్కడ బావుంది కదూ ! కూర్చుందామా ?" అన్నాడు పద్మనాభం. నాగమణి మెట్లమీద కూర్చుంది. ఆమె పల్చని పాదాలచుట్టూ ఎర్రనిచీర అంచు లలితంగా కదుల్తున్నది. పద్మనాభం కూడా ఆమెకు కొంచెం దూరంలో కూర్చున్నాడు.

"నిన్ను ఇల్లా రమ్మని పిలవటానికి కారణం ఏమిటో నీకు తెలుసా ?"

నాగమణి అతని ముఖంలోనికి చూసింది. భర్తని అంత దగ్గరగా చూడటం ఆమెకు అదే మొదటిసారి. ఆందోళనగా అతని కణతలు అదరటం గమనించింది.

"ఏదో చెప్పాల్సున్న దనుకున్నాను."

"సరిగ్గా "గెస్" చేశావు. చూడు ! ఇన్నాళ్ళూ నిన్ను అనవసరంగా క్షోభపెట్టాను. నా సంగతులన్నీ నీకు వివరించి నాఅశక్తతకి నీ ముందు క్షమాపణ అడగాలని సంవత్సరం నించీ అనుకుంటున్నాను."

నాగమణి మాట్లాడలేదు. చెవులు మాత్రం వింటున్నాయి.

"నీకు నన్ను గూర్చి తెలియపర్చుకోవాల్సిన అవసరం రాదనుకున్నాను. నువ్వు కూడా, సంధ్యలానే చదువుకున్న దానివనీ, వంటరితనం భరించలేక నువ్వు, ఏదో దారి చూసుకుంటావనీ అనుకున్నాను. కాని నువ్వు ఇన్నిరోజులూ, మౌనంగా గడపటం చూస్తే నాకు జాలివేస్తోంది. నీ జీవిత సౌఖ్యం గురించి, నీ మానసికానందం గురించీ, నీవేమీ ఆలోచించటం లేదా ? నీకు జరుగుతున్న అన్యాయం గురించి పెదిమ మెదల్చకుండా సహించకల్గే మూగశాంతి నిన్నెలా అలుముకున్నదీ ?" అతని ప్రశ్నలో వ్యధ నిండింది. నాగమణి మాట్లాడలేదు. ఆమె నుదురు వేడెక్కింది. ప్రజ్వలిస్తున్న అస్తమయారుణుడు ఆమె కళ్లని మూసుకునేట్లు జ్వలిస్తున్నాడా, అనిపిస్తున్నది.

"ఇంట్లోనే చెప్పుదా మనుకున్నాను చాలాసార్లు. కాని ప్రశాంతంగా ఉన్నచోట్ల చెప్పాలనిపించి నిన్నిలా పిలుచుకొచ్చాను." నాగమణి చెంపలకేసి చూశాడు. సన్నగా ఎత్తుగా ఉన్న ఆమె ముక్కున మెరుస్తున్న ఒకే ఒక సన్నని మంచి ముత్యం పుడక చెంపలమీది అరుణిమని తను కూడా పులుముకుంటున్నది.

"చెప్పండి" సన్నగా అంది నాగమణి ఆ గొంతులో జీవం స్ఫురించటంలేదు. నిర్వేదంగా ఉన్నది.

ఆమె ముక్తసరికి పద్మనాభానికి ఆశ్చర్యం కలిగింది.

"నాకసలు ఈ చదువుకున్న వాళ్లంటే సదభిప్రాయం లేదు. వాళ్లకి ఒక విధమైనటువంటి అహంభావం ఉంటుంది. వాళ్లకి వాళ్ల మనసేకాని ఎదుటి మనసుల నర్థం చేసుకునే శక్తి ఉండదు. అందుకనే నిన్ను గురించి ఆలోచించిన కొద్దీ నా మనసు అశాంతి పొందుతోంది. నిజంగా సంధ్యని ఎంతగానో ప్రేమించాను. ఆరాధించాను. ఆమె సంస్కారం, విద్యార్జనమువల్ల పరిణతి చెందుతుందని ఊహించాను. ఆ ఊహల ఉన్నతాశయాల వలయంలో పరిభ్రమించాను. కాని ఆ ఉన్నత విద్య వల్లే నా జీవన సహచరి, మన శ్చాంచల్యం పొందకల్గుతుందని నాకు తెలియదు. అసలు ఆమెకి మనసు నిలకడ లేనిదేమో అన్న, అనుమానం నాకు తట్టనంత నేర్పుగా వ్యవహరించింది సంధ్య. నువ్వెప్పుడన్నా ఇటువంటిది విన్నావా? ప్రేమించిన యువతులు మోసపోవటం సర్వసాధారణం కాని, యువకులు, మోసపోవటం తెలుసునా ? నా ఆరాధన తృణప్రాయంగా చేసింది సంధ్య. విధికృతం అనుకోకు. సహవిద్య ప్రభావం. తరుణ ప్రాయులైన యువతీ యువకులని ఒకే చోట చదుకునేట్లు చేయటంవల్ల, వాళ్లల్లోని ఇంద్రియ వాంఛల్ని మేల్కొల్పటం అవుతున్నది. దానితో కళాశాలలు, బృందావనా లౌతున్నాయి. ఎన్ని నిబంధనలైనా తరుణ మనసులని లొంగదీయలేవు. ఆ మనసులకి అతీతమైన శక్తి ఉంటుంది. విద్యార్జనే ముఖ్యోద్దేశం అనుకునే "శాతం" చాలా స్వల్పం. సంధ్యని ఏ ముహూర్తంలో కలుసుకున్నానో అప్పట్నించీ కూడా, ఆమెని, నాదానిగా చేసుకోవాలన్న తపన నాలో అణుచుకో లేనిదైంది. మా ప్రథమ పరిచయం అయ్యేనాటికి ఆమె ఇంటరు చదువుతోంది. పరీక్షలైపోయేదాక వేచియుండి అప్పుడు, అడిగాను. "డిగ్రీ" పుచ్చుకోగానే పెళ్లి చేసుకుందాం అన్నది. ఇంటరులో క్లాస్ వచ్చింది. నాకు ఆ ఏడాదే, మైసూరు ట్రాన్స్ఫర్ అయ్యింది. తన్నా యూనివర్సిటీలో చేర్పించాను. ఆమెకి ఉన్నత విద్య, చదువుకోగల్గటం స్వప్న వృత్తాంతం అనుకునేదట ! ఆరుగురు అక్కచెల్లెళ్లు ఉన్న కుటుంబం వాళ్లది. తండ్రి వీథిబడి నడుపుకునేవాడట. పెద్దక్కని రెండో పెళ్లివానికిచ్చి చేశారట. ఆమె వితంతువయి పోయిందట. హిందీ పరీక్షలు ప్యాసయినది. హిందీ ట్యూషన్స్ చెప్పుకుంటుండేది. తల్లీ లేదు. సంధ్య స్కాలర్‌షిప్పు సంపాదించి చదువుకునేది. చిన్న చెల్లెళ్లు. ఫారాలు చదివి మానేశారు. అందరూ పెద్దక్క సంపాదనమీద తినేవాళ్లు. ఒక చెల్లెలు నాటకాల్లో వేషాలు వేసేది. అంచేత ఎప్పుడూ నాటకం కంపెనీ వాళ్లతోనే తిరిగేది. సంధ్య అన్నా, వాళ్ల కుటుంబం అన్నా నాకు చెప్పలేని జాలివేసేంది. సంధ్యకోసం నేనేం చేయమన్నా చేయకుండా ఉండలేని పరిస్థితిలో పడ్డాను నేను. మేము సుబ్బయ్య రోడ్డులో ఇల్లు తీసుకుని మకాం పెట్టాము. రోజూ, కాలేజీకి, సంధ్యని కారులో తీసుకువెళ్లి దింపేవాణ్ని. సంధ్య "టాకెటివ్"గా ఉండేది. మొదటి ఆరు వారాల్లోనూ చాలా మంది స్నేహితులని సంపాదించింది. అందులో ఆడవాళ్ల స్నేహాలకన్న మగవాళ్ల స్నేహాలంటేనే ఆమె అమితాశక్తి చూపెట్టేది. నాకు అప్పుడు ఆ తేడా ఏమీ తెలిసేదికాదు. నేను సాయంత్రం ఇంటికి వచ్చే సరికి సింగారించుకుని గుమ్మంలో నించునేది. నిజంగా, నాకామెని చూడగానే చేతుల్లోకి తీసుకొని గాఢంగా హృదయానికి అదుముకోవాలన్నంత ఆకాంక్ష కలిగేది. "నేను నీకు దూరంగా ఉండలేను. సంధ్యా ! మనం పెళ్లి చేసుకుందాం." అనేవాణ్ని.

"డిగ్రీ పుచ్చుకోనియ్యి. అయినా నీకు నేను ఎంత దూరంలో ఉన్నాను. కొలిచిచూస్తే అర్ధగజంకూడా లేదు.

కదా !" చిలిపిగా నవ్వేది. ఆ నవ్వు నా హృదయంలో చెరగని ముద్రవేసింది. కాని నేను ఎప్పుడూ హద్దు మీరలేదు. నా కల్లాంటి అశక్తతలేదు అనుకునేవాణ్ని. కాని నేను నిగ్రహపరుణ్ని అనుకునే గర్వం అంతా సంధ్యవల్ల పటాపంచలై పోయింది. అది నిగ్రహంకాదు, నీ దుర్బలత అని తేల్చి అన్నది సంధ్య. అసలు నంజుండై పరిచయంవల్లే సంధ్య మన శ్చాంచల్యం పొందినదని నా అభిప్రాయం.

"ఆమె క్లాస్ మేటా ?" అడక్కుండా ఉండలేక పోయింది నాగమణి.

"వాడి బొంద. మా "కోటెనెంట్". అంత క్రితం ఒకసారో రెండుసార్లో గేట్లో తారసపడి ఫార్మల్‌గా విష్ చేస్తూ వచ్చాడు. ఆరోజు, నా శని ప్రారంభమయినరోజు. మేమిద్దరం సిటీలోకి వెళ్లి వచ్చాం. బాగా చీకటి పడింది. సంధ్య తలుపు తాళం తీయబోతూ కెవ్వుమని కేకేసింది. ఏమి టేమిటి ! అంటూ ప్రక్కవాటాలోంచి" నంజుండై" వచ్చాడు. చీకట్లో తాళం తీయబోతూంటే చిన్న తేలుపిల్ల కుట్టిందిట ! సంధ్య ప్రతి చిన్నబాధకీ, అతి సుకుమారం వలక బోసేది. నేను తలుపుతీసి లైటువేసి ప్రక్క దులిపివేసేదాకా, చేయి దులుపుకుంటూ, నంజుండై భుజాల నాధారంగా చేసుకొని నించుంది. తరువాత, లోపలికి వచ్చి ప్రక్కమీద మూలుగుతూ పడుక్కుంది. "నంజుండై" లోపలికి వెళ్లి చిన్న గ్లాసులో నీళ్లుపోసి ఏదో మంత్రించి తెచ్చిచ్చాడు. సంధ్య మూలుగుతూనే కూర్చుని ఆ నీళ్లు త్రాగింది. "నంజుండై" మంచంమీద కూర్చుని ఆమె చేతిని తన చేతిలో పట్టుకొని నిమురుతూ కూర్చున్నాడు.

"చేత్తో తీసినట్టే పోయిందండీ !" అన్నది సంధ్య.

"మరేం అనుకున్నారు ? నా మంత్రం అంటే !" నవ్వాడు.

"ఈ రాత్రి శివరాత్రి కాకుండా కాపాడారు." అన్నాను.

"శివరాత్రెందు కవుతుందీ ? స్వచ్ఛమైన శారదా పూర్ణిమ" అన్నాడు. ఆ రోజు రాత్రి పన్నెండింటిదాకా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము.

తర్వాత పదిరోజులకి నేను సాయంత్రం ఆఫీసు నుంచి, వచ్చేసరికి ఇల్లుతాళం వేసి ఉంది. సాధారణంగా ఆమె ఒక్కర్తీ ఎక్కడికీ వెళ్లేదికాదు. ఏవో అత్యవసర వస్తువులు కొనుక్కో వలసి ఉంటేతప్ప. ప్రక్కనున్న ఇంటివారమ్మాయి వచ్చి,

"వదిని, వూరుచూడబోయింది." అని తాళం చెవి ఇచ్చింది. ఆ రాత్రికి రాలేదు. మర్నాడూ రాలేదు. యూనివ ర్సిటీకి వెళ్లి కనుక్కుంటే, ప్రొఫెసర్, కాన్ఫరెన్‌కి వెళ్లా రనీ, అంచేత సెలవులనీ తెలిసింది. మాట మాత్రమైనా, నాతో చెప్పకుండా ఎందుకు వెళ్లిందా, అని ఆలోచించాను. తండ్రిదగ్గర కెళ్లిందేమో. నాకు తెలియకుండా ఎందుకు వెళ్ల తుంది ? డబ్బుకోసమైనా, నన్నడగవలసిందేకదా ! ఆ మూడో రోజు సాయంత్రానికి వచ్చింది. ఆ రోజు ఆదివారము. అది వరకు ప్రతి ఆదివారము చాముండీశ్వరీ దేవాలయానికి వెళ్లి కుంకుమ పూజ చేయించేవాళ్లం. నాకు కోపం వచ్చినా లోపల్నే అణుచుకున్నాను. నేను ప్రశ్నవేసేలోగానే—

"నంజుండై మద్రాసు పోతున్నాడు. నా కెలా నూ, సెలవలేకదా అని జాలీగా వెళ్లొచ్చాను." అన్నది.

ఈలోగా నంజుండై వచ్చాడు. తీరుబాటుగా కూర్చుని బాతాఖానీ మొదలెట్టాడు.

"మద్రాసులో, మాకజిన్, అక్వేరియమ్‌లో వర్క్ చేస్తున్నాడు. సంధ్య చూడాలనుందంటేనూ, ఓ ట్రిప్ కొట్టొచ్చని బయులుదేరాము.

అంటే తనే అతన్ని అడిగిందన్నమాట ! ఆశ్చర్య పోయాను.

"అల్లాగా ! మంచి పనే చేశారు. మీరేం చేస్తున్నారు ?" అడక్కుండా ఉండలేకపోయాను.

"యం. యస్. సి. ప్యాసయి కొన్నాళ్లు ఒరిస్సాలో పనిచేశాను. మెరైన్ ఫిషరీస్‌లో రీసెర్చి నిమిత్తం కెనడా వెళ్లటానికి స్కాలర్‌షిప్ వచ్చింది. సెప్టెంబర్‌లో స్టారు అవుతాను.

ఆపయిన, అతను చేపల గురించి అనర్గళంగా చెప్పుక పోయాడు.

"శీలావతి, వారిగ, బొమ్మడ, మట్టగిడస, ఇంగిలాయి గురించి, నాకు కించిత్తూ తెలియకపోయినా, అతని బోరింగ్‌ని, నిశ్శబ్దంగా భరించాను. ఒక్కొక్కవ్యక్తి తన 'హాబీ''ని గురించి ఎదుటి వ్యక్తికి, ఇంటరెస్ట్, లేకపోయినా, విన్పించగల సమర్థత కలిగుంటాడు. అలాంటి వ్యక్తి నంజుండై. ఈలోగా సంధ్య స్నానంచేసి వచ్చింది. తెల్లటి షిఫాన్ చీర, తెల్లని చోళి వేసుకుంది. జుట్టు విరబోసుకుని, కిటికీలో కూర్చుంది.

"రేపు కృష్ణరాజసాగర్ కెళ్దాం !" అన్నాడు.

"ఓ యస్ !" అన్నది. సంధ్య.

"తప్పదుస్మా ! మళ్లీ బొమ్మిడల్లే జారిపోకూడదు. బొమ్మిడ అసలు చేతుల్లో నిలవదండీ ! జారిపోతూంటుంది ఈ సంధ్యల్లే !" ఇద్దరూ నవ్వారు.

మర్నాడు ఆఫీసుకి సెలవు పెట్టాను. నా ప్రమేయం లేకుండా, సంధ్య ఇష్టం వచ్చినట్లు తిరగటం నా కిష్టంలేదు. సంధ్య నా ఉనికిని, గమనించినట్లు లేదు. "స్టౌ" రాజేసింది. పాలుపడేసి పూరీల పిండి కలుపుతూ కూర్చుంది. సంధ్యలో ఒక విధమైన లేజీనెస్ ప్రబలింది. ఆమెలో చదువుకుందుకు, ఉండే ఉత్సాహంకన్న, హౌస్‌హోల్డు,

డ్యూటీస్ మీద ఎక్కువ శ్రద్ధ ఉండేది. ఇప్పుడు, ఇప్పుడు, నాకు అనిపిస్తూంటుంది. ఆమె ఈ చదువవేవంకతో రకరకాల వ్యక్తుల్ని కలుసుకో గోరింది. అది ఆమె జీవితంతో వేసుకున్న పందెం. స్వంత ఆకర్షణ శక్తితో ఎంత ఉన్నతమైన వ్యక్తుల్ని తన చుట్టూ త్రిప్పుకోగలదో పరీక్షించింది, అని నాకనిపిస్తుంది. ఆమె పాలుదింపి కప్పులో పోసి నాకిచ్చింది. భోజనం, కారియర్‌తో, తెప్పించుకునే వాళ్లం. పాలు, ఎప్పుడన్న 'లైట్'గా టిఫిన్ సాయంతో చేసేది సంధ్య.

"మధ్యాహ్నం ప్రోగ్రాం, డిసైడ్ చేసేవన్న మాట !" అన్నాను.

"అవును. నువ్వుకూడా సెలవుపెట్టావు కదూ ?"

నేను దానికోసమే సెలవుపెట్టా ననుకుంది కాబోలు

"నేను దేనికి సెలవు పెట్టాననుకున్నావ్ ?"

"దీనికోసమే ననుకున్నాను."

"కాదులే ! అయినా ఇదివర కెన్నిసార్లు చూడలేదు మనం ?"

"చూస్తేమటుకు ? కంపెనీ కోసం !"

"నువ్వేమన్న అనుకుంటావని ఇన్నాళ్లూ టాలరేట్ చేశానుకాని, అతని కంపెనీ ఉట్టి "బోర"నుకో !"

"ఎవళ్ల టేస్టునిబట్టి వాళ్లూ హించుకుంటారు. దానికి నీ తప్పేం లేదులే !"

"అయినా పరాయి మగాడితో అల్లా ఒంటిగా తిరగటం, నాకు నచ్చలేదుసుమ్మా !" అనేశాను.

"పరాయి కానిదెవరు ? నువ్వుకావా ! నేను నీతో ఇల్లా ఒచ్చెయ్యటం, తప్పుకాదా ? నేను తెగిన గాలి పటాన్ని. నన్ను జాగ్రత్తగా పూవులా పెంచి పెద్దచేసి ఒకయ్య చేతిలో పెట్టగల ఆర్థికస్తోమతు నా తండ్రికిలేదు. నీతో నేను రావటాన్ని మన వూళ్లో తెలుసున్న, నలుగురూ, ఏమని, నిర్వచిస్తారో, నీకు తెలియనిదికాదు. మనిద్దరిమధ్యా ఈ అయిదారు వెలలబట్టీ ఏ ఆకర్షణా కలగలేదని, మనిద్దరికే తెలుసును. నన్నింత తెలుసుండీ, నువ్విలా అపోహ పడ్డావంటే, నీ సంస్కారం యొక్క కొలత, తగ్గుతోందా అన్న అనుమానం కలుగుతోంది.

"నాది అన్న వస్తువుని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందా ఉండదా !"

"మీది అని మీరనుకుంటున్నారు. అవునో కాదో ఇంకా నిర్ధారణ కాలేదుగా !" నవ్వింది.

"అది సర్లే ! అమ్మకు చూడాలనుందట. ఫోన్‌చేసింది. వెళ్దామని సెలవుపెట్టాను."

"అయితే వెళ్తావన్నమాట !"

"మనిద్దరం వెళ్ళాలి. నా పుట్టినరోజున, స్వామికి కళ్యాణోత్సవం, చేయిస్తుందిట."

"నీకు కళ్యాణం అయ్యేదాకా, స్వామికి కళ్యాణం చేయిస్తూనే ఉంటారు మీ అమ్మ ! కాని, నంజుండయ్య ఏమనుకుంటాడు ? తీరా అనుకున్నాక మా నేస్తే ఏం బాగుంటుంది ?"

"చిన్నప్పట్నించీ, నామంచీ చెడ్డా చూసి, చేసి, తాపత్రయం పడుతున్న, అమ్మ మాటలకన్న ఈ ముసాఫిర్ ఏమనుకుంటాడో అన్న భయం ఎక్కువన్నమాట నీకు !" వళ్లు మండింది నాకు.

"నీకు జెలసీ ఎక్కువయిపోతూందే రోజురోజుకీనూ ? నంజుండయ్య నీకురైవల్ అనుకుంటున్నావా ?"

నేను మాట్లాడలేదు. నాకు కోపంవచ్చిందని గ్రహించిందికాబోలు.

"సర్లే ! ఎల్లా వెళ్లటం ?" అన్నది.

"కారులో షికారుగా పోవటమే !"

మొత్తానికి, నంజుండయ్యతో కలవనీయకుండా ఇక్కడకు తీసుకవచ్చేశాను. నాలుగురోజులున్నాం. అమ్మ స్వామివారికి, కళ్యాణోత్సవం చేయించింది. చాలా మంది స్నేహితులనీ బంధువుల్ని పిలిచింది. స్వామి కళ్యాణోత్సవంలో, స్వామివారి కళ్యాణం అక్షింతలు, మా ఇద్దరిమీదా ఎవ స్ఫూర్తిగా జల్లింది. సంధ్యకేసి చూశాను. ఆమె అన్యమనస్కగా కనిపించింది. లలిత దూరంగా నించుని చూసింది. అన్నట్లు లలిత గురించి చెప్పలేదు నీకు."

"నాకు తెలుసు ! మీ మావయ్య కూతురు."

"నీ కెల్లా తెలుసు ? మన పెళ్లికి రాలేదుకదూ !"

"రెండేళ్లనుంచీ మీ ఇంట్లో ఉంటున్నాను. మీ బంధువుల్ని గురించి తెలీదా !"

చీకటి పడిపోయింది. లోయలో దూరంగా చంద్రగిరిలో వెలిగిన దీపాలు నక్షత్రాల మాలల్లా మెరుస్తున్నాయి. భూదేవి దీపాలు వెలిగించుకోవటం చూసిన ఆకాశరాజు తను కూడా తొందర తొందరగా తారలని పిలవజొచ్చాడు. పద్మనాభం లేచాడు.

"చీకటిగా ఉందికదూ ? ఇప్పుడు మళ్లీ క్రిందికి పోవట మెందుకు ? ఇక్కణ్ణే ఉండి తెల్లవారేక పోదాం." అన్నాడు పద్మనాభం.

"మీ ఇష్టం !" అన్నది.

అప్పటిదాకా, ఆహ్లాదకరంగా ఉన్న చల్లనిగాలి, చలిగాలిగా మారింది. ఇద్దరూ కారెక్కి, కాటేజెస్ దగ్గరకొచ్చారు. ఆ కాటేజీల వరండాలు అర్ధ చంద్రాకారంగా ఉండి, మధ్య మధ్యని ఒక స్తంభం మీదనిలబడ్డాయ్ వరండా చుట్టు తిరిగి, రెండు మెట్లు, కోనేటి సానంచాలల్లె కట్టబడినాయ్. స్తంభం అడుగున చలవరాతి పలకమీద, ఆ కాటేజీలకి కావలసిన

సొమ్ము విరాళమిచ్చిన దాతలపేర్లు చెక్కబడి ఉన్నాయి. మొత్తం కాటేజీ, రెండు పోర్షన్స్ క్రింద ఇస్తారు. వంట చేసుకునే వారికి "కిచెన్" ఉన్న పోర్షనూ, వంట చేసుకోని వారికి, బాత్‌రూం, బెడ్‌రూం, డ్రాయింగ్‌రూం, ఉన్న పోర్షనూ ఇస్తారు. ఇరువయినాలుగ్గంటలకి, 3 రూపాయలు అద్దె ఇవ్వాలి. పద్మనాభం ఒక పోర్షన్‌కి అద్దెకట్టి రసీదు తీసుకుని వచ్చాడు. దేవస్థానం ప్యూన్ కూడా వచ్చి తాళంతీసి, తాళంచెవి పద్మనాభానికిచ్చి వెళ్ళిపోయాడు.

"నాకేదయినా అంతేమణీ ! అప్పటి కప్పుడు తోస్తూంటుంది. లేకపోతే రాత్రి ఇక్కడ్నే గడుపుదామన్న ఆలోచన ముందేవస్తే నువ్వు బట్టలేవైనా తెచ్చుకో నుందువు !" అన్నాడు.

ఈలోగా దేవస్థానం ప్యూన్ వచ్చి, "మీకు ఫోన్‌కాల్" వచ్చిందని చెప్పాడు. పద్మనాభం వెళ్లి అర్థగంటలో తిరిగి వచ్చాడు. నాగమణి ప్రశ్నార్థకంగా చూసింది.

"క్రిందనించి ! అమ్మ బట్టలు, ఫస్ట్‌బస్‌లో పంపు తుందిట. మన్ని దేవదర్శనం చేసుకుని రమ్మన్నది." అన్నాడు.

నాగమణి తలవంచుకుంది. అత్తగారి ఆప్యాయితకి ఆమె కళ్ళు ఆనందంతో చెమర్చాయ్. పద్మనాభం, మణివేపు తదేకధ్యానంగా చూస్తున్నాడు. ఆమె పల్చని పమిట కుచ్చెళ్లల్లో నించి రూపాయికాసంత పచ్చని మాంగళ్యాలు నవ్వుతున్నాయ్. ఆ మాంగళ్యాలకున్న ఎర్రని, కెంపురాళ్ళు పమిటకు గుచ్చు కుని పద్మనాభం వేపు సూటిగా చూస్తున్నాయ్ ! పాలి పోయిన ఆమె పల్చని చెక్కిళ్లని, తన చేతులతో నిమరాలన్న ఆకాంక్ష అప్పుడే విత్తనం పగిలి, పైకి చూస్తున్న చిక్కుడు మొలకలా తలెత్తింది.

"ఆకలేస్తోందా నీకు ? ఏమన్నా తేనా ?"

"ఇవ్వాళ శనివారంకదా ! నేనేమి తీసుకోను !" అన్నది. మణి.

"అమ్మ నీకుకూడా స్వామిభక్తకోటి వర్గంలోనికి తగునట్లు ట్రైనింగ్ ఇచ్చేసిందన్నమాట !" అన్నాడు. కిటికీలోంచి వచ్చే చల్లని గాలికి ఆమె చెవులమీది చిరు వెంట్రుకలు చెంపలమీదకు ప్రాకబోతున్నాయి. అక్కడున్న ఇనప మంచంమీద కూర్చున్నాడు పద్మనాభం.

"మీరేదైనా పుచ్చుకొని రండి ! నే నిక్కడ్నే కూర్చో నుంటాను." అన్నది. మణి.

"హుం ! నాకూ శనివారమేలే ! అసలు సంధ్య నిర్గమ నంతో నాలో ఆకలి దప్పులు నశించిపోయాయ్ ! ఏమిటో వృథాగా బతికేస్తున్నట్లు అనిపించుతుంది. అమ్మ జీవితా నికి నేనే ఆశారేఖవటంనుంచి, నేను జీవించక తప్పటంలేదు."

భర్త నిరాశాధోరణి మణి వినదల్చుకోలేదు. అంచేత ఆతని మాటలకి అడ్డువస్తూ—

"మీరు లలిత ఆగమనం దగ్గర ఆపేరు !" అన్నది.

"ఇవ్వాళ మనం జాగారం చేయాల్సి ఉంటుందన్న మాట ! సర్లే ! బాగుంది. లలిత మామయ్యకూతురు. చిన్న ప్పుడు పెద్దవాళ్లముచ్చట్లల్లో ఈ ఇంటికోడలు ! అమ్మకి లలితంటే ప్రాణం. భద్రికీ అంతే ! లలిత మా ఇంట్లోనే పెరిగింది. మామయ్యకి చాలా ఆస్తి ఉండేది. అది, మా నాన్న గారే అజమాయిషీ చేసేవారు. లలిత క్లాసుమేటే సంధ్య. లలితకి బాగా డబ్బుకర్చుపెట్టటం, దేశమంతా తిరిగి రావ టం హాబీలు. సంధ్యకి చదువులో ముందురోజుల్లో బాగా శ్రద్ధ ఉండేది. లలితకి ఉండేదికాదు. లలిత పుస్తకాలన్నీ సంధ్య ఇంట్లోనే ఉండేవి. లలిత పరీక్ష పోయినప్పుడు నాకు బాగా కోపం వచ్చింది. భద్ర స్కూల్ ఫైనల్‌దాకా చదువుకుని మానేసింది. లలిత ఇంటరు చదువుతూంటే నాకానందం కలిగింది. అల్లాంటిది బలాదూర్లు తిరుగుతూ పరీక్ష పోగొట్టుకుంటే నాకు కోపం వచ్చింది.

"డబ్బంతా తగలేసావ్ ! నీకు ఈ జన్మకి చదువురాదు." అన్నాను.

"మనిద్దరిలో ఎవరు చదువుకుంటే ఏంబావా ? నాబదులు, నీకు ఈ లోకంలో ఉన్న డిగ్రీలన్నీ వచ్చాయి చాలదా ఏం ?"

"అల్లాంటి అమమ్మ కబుర్లుకట్టిపెట్టి ప్రైవేటు పెట్టించుకో ! సెప్టెంబరులో నైనా గట్టెక్కిద్దువు కాని" అన్నాను.

"నో సెప్టెంబరు ! నో మార్చి ! నేను చదవాలేను. పెట్టాలేను. సెప్టెంబరులో నీ మైసూరు వస్తాను. దసరా సెలబ్రేషన్స్ చూట్టానికి."

"వస్తే ! రా ! నాకేం భయమా ! నీకసలు చదువు మీద లేందే ! భద్రీ అంతే ! నువ్వూ అంతే ! ఉత్తడమ్మీల్లా తయా రవుతున్నారు."

"ఏమిటత్తా ? చదువో చదువో అని గోలచేస్తాడు ? చదువుకుని ఏం చేయాలనీ ?" అన్నది లలిత.

"అవున్నా, ఏం చేయాలనీ ? ఎటూ ఈ సంవత్సరం పెళ్లి చేసేద్దా మనుకుంటున్నా." అన్నది అమ్మ.

నాకు ఏదో దిగులువేసింది. అమ్మ అంత నిశ్చితంగా చెప్తోంటే నే నెల్లా నా హృదయం విప్పి చెప్పాలో అర్థం కాలేదు.

"అప్పుడే చేసుకోను అమ్మా ! భద్రికవనీ !" అన్నాను.

"ఇంకా చిన్న పిల్లాడివా నాయినా ? గునుస్తున్నావ్ ! అయినా లలిత తొందర భరించలేకుండగా ఉన్నాను. మరి" అంది. లలితకి కోపం వచ్చిందికాబోల్సు. ముఖం మందార పువ్వులా వెలిగింది.

"అయితే దానికి చేసేయి ! నాకేం తొందరలేదు." అన్నాను. లలితకి అర్థం అయిందికాబోల్సు. కళ్లు పెద్దవి చేసి నాకేసి చూసింది.

"బాగుంది నీ మాట ! అదేదో పరీక్ష ఫెయిలయిందని ఏడిపిస్తున్నావా ? పెళ్లవుతే మటుకు చదువుకోకూడదా? సెప్టెంబర్‌కి కట్టుందిలే ! ఈ 'మే'లో మాత్రం నీ పెళ్లి అయిపోవాలి. నువ్వు దగ్గర కూర్చుని చదివించుకో ! తప్పుతుందా !" అన్నది. నాకు కొంచెం ధైర్యం వచ్చింది. అయినా ముసుగులో గుద్దులాట లెందుకు ? ఎప్పుడో ఒకప్పుడు చెప్పాల్సిందేకదా ? తీరా పెళ్లి ప్రయత్నాలు మొదలెట్టాక చెప్పితే అంతా అభాసు అవుతుంది. అంచేత గుండె దిట్టం చేసుకుని చెప్పేశాను.

"అమ్మా! నేను దీన్ని చేసుకోను. ఎ. మ్మే. ప్యాసయినా." లలిత కళ్లు వర్షిస్తున్నాయి. అయినా, నాకు జాలివేయలేదు.

"ఏమిట్రా ? అంత లోకువ చేస్తావ్ !" అన్నది అమ్మ. అమ్మ నేను పరిహాసం ఆడుతున్నా ననుకొన్నది. ఇంకా !

"నిజమే అమ్మా ! దాన్ని పెళ్లాడను. దానికి బోలెడంత ఆస్తి ఉందికదా ! ఏ పిల్ల జమీందారో పెళ్లాడకపోడు !"

అమ్మ గ్రహించింది. ఆమె ఏవిషయంలోనూ నన్ను వత్తిడి చేయదు. ఒక్క మాట అన్నది.

"చిన్నప్పటినుంచీ నీకోసమే పెంచాను రా ! నాయనా! చనిపోయిన మామయ్యమాట తీర్చగల ననుకున్నాను. భగవంతుని ఇచ్ఛ ఈ విధంగా ఉన్నది కాబోలు. పోనీ, నీకెవర్ని చేసుకోవాలనుందో చెప్పు! ఈ సంవత్సరం నీ పెళ్లి చూడాల నుంది." శాంతంగా ఉన్న ఆమె మాటల్లో ఎంతో నిగూఢమైన వేదన అంతర్గతమై ఉన్నది! సంధ్యని చేసుకుంటానని చెప్పాను. సంధ్య చదువు పూర్తి అయితేకాని పెళ్లి చేసుకోనన్నది. లలిత సెప్టెంబర్‌లో ఇంటరు పూర్తి చేసింది. తర్వాత "ఎయిర్ హోస్టెస్" ఉద్యోగంలో చేరింది.

"నీకు ఉద్యోగం చేస్తేకాని గడవదా ! అంతగా ఉద్యోగం చేయాల్సింటే, చక్కగా, ఏ ఎ. మ్మే.నో ప్యాసయి లెక్చరర్ చేయొచ్చుగా ?" అన్నాను.

"ఉద్యోగ మన్నాక ఏదన్నా ఉద్యోగము కాదా ఏమిటి ? నేను చదువుకోలేనని ముందే చెప్పానుగా ? ఏదో కాలక్షేపము కావద్దా ?" అంది.

"ఛీ ఛీ ! నువ్వు మా ఇంట్లో ఎంత దర్జాగా ఉండేదానివి ! అల్లా నలుగురిలోనూ మీకేంకావాలి. మీకేంకావాలి, అని సర్వెంట్‌లా అడగటంలో నీకు సిగ్గువెయ్యటంలేదూ ! హాయిగా జమీందారిణిలా కాలుమీద కాలువేసుకు కూర్చునే యోగం లేదులే నీకు !" అన్నాను.

"నా మనసైంది. చేసుకుంటున్నాను. నీకెందుకు ?"

నిజమే ! నాకెందుకు ? అయినా మా ఇంట్లో మా ఒద్దికలో పెరిగిన పిల్ల ఇలా వీధిలో కెళ్లటం ఏం బాగుంటుందీ ?

"మనసట ! మనసు ! నీ మనసుకి, కళ్లూ, చెవులూ ఉన్నాయా ? ఉంటే ఈ పని చేయటాని కొప్పుకోదు నీ మనసు !" కాస్త తీవ్రంగానే అన్నాను.

"నీ మనసుకే లేవు అవి. ఉంటే నువ్వాపనీ చేయవు !" దానికి నా దగ్గర ఎప్పుడూ చనువుంది. మాటకి మాట అన్నంత సేపు అంటుంది. అనటానికి ఎప్పుడైతే మాటలు దొరకవో అప్పుడు ఏడుస్తూ కూర్చుంటుంది.

"మాటకి మాట అన్నానని సంబరమేకాని లల్లీ !' అమ్మ బాధ గుర్తించావా ? ఆమె ఎంత బాధ పడుతున్నదని ?'.

"ఆమె బాధకోసమే నువ్వీపని చేశావు ! పాపం ! కాస్తయినా వెనుకచూపులేదు నీకు ! గురివింద గింజవి !" అని వెళ్లిపోయింది. తర్వాత మళ్లీ స్వామివారి కళ్యాణోత్సవం నాడు కలిసింది. సంధ్య దగ్గరకు వచ్చి. "మేమంతా పాపనాశంకి వెళ్తున్నాము. రండి!" అన్నది మా ఇద్దరినీ ఉద్దేశించి.

"నేనేం పాపాలు చేయలేదే ? నాశం చేసుకుందుకు?" అన్నది సంధ్య.

"మేము ఊరికే ప్రకృతి నారాధించటానికెళ్తున్నాం. అయినా నువ్వొస్తే తప్పకుండా స్నానం చేయిస్తాను." అన్నది లలిత.

"అయితే అసలు రాను."

"నీ స్నానం చేసిన నీళ్లు పంచరంగుల్లో వస్తాయని నీకు నమ్మకం ఉన్నదన్నమాట. స్నానం చేయ్యొద్దులే ! నరదాగారా ! రా బావా ! నీ పాపం పరిహారం చేసుకుందువు కాని." అన్నది. ఎల్లా అయితేనేం ఉభయులం బయలుదేరేం. లలితా వాళ్ల పెద్దతల్లి కొడుకు రామం, భద్రా, కారుడ్రైవరూ. గోగర్భం దగ్గర దిగి కాలి నడకన పాపనాశం జేరాం. చాలా సుందర దృశ్యం. కొండ మంచి క్రింది కురికే జలపాతం సంధ్యారాగంలో పగడాలు రాలుతున్నట్లు భ్రమ పుట్టిస్తున్నది. ఇనప గొలుసులు పట్టుకుని స్నానాలు చేస్తున్నారు. చంటి పిల్లలని కాస్సేపు ఆ నీళ్లక్రింద అట్టే పెట్టి మళ్లీ ఇవతలికి తీస్తున్నారు.

"ఇద్దరు ఇద్దరు కొంగుకొంగూ కలుపుకుని స్నానం చేస్తే పుణ్యం అమోఘంగా వస్తుందట. అంచేత మీరిద్దరూ స్నానం చేయండి." అన్నది లలిత.

"అయితే మరి మీ మాటో !" అన్నది సంధ్య.

"భద్రీ రామం కలిసి, చేస్తారూ ! అన్నది ఆలోచనగా లలిత. భద్ర సిగ్గుతో ముఖం క్రిందికి దించుకుంది.

"నువ్వూ డ్రైవరూ మిగిలారు !" అన్నది సంధ్య. డ్రైవరు దూరంగా ఉన్నాడు కనుక సరిపోయింది. లేకపోతే లలితకి కోపంవచ్చేది. నేనెంత ప్రేమించి ఆరాధిస్తున్నా, నా బంధువుని ఆమె కించపరచటం సహించలేకపోయాను.

"ఏమిటా మాటలు సంధ్యా ! పరిహాసానికి కూడా హద్దు ఉండాలి." అన్నా విసుగ్గా. సంధ్యమూతి ముడుచుకు కూర్చుంది.

"నేనేం అనుకోను. బావా ! నేను డ్రైవరునే పెళ్లాడబోతున్నాను." అన్నది లలిత. భద్ర చీదరింపుగా—

"ఏమిటే వెధవ మాటలు లల్లీ !" అన్నది.

"నిజం ! నేను పెళ్లి చేసుకునేది డ్రైవరునే ! డ్రైవరులు కారులూ, రైళ్లూ, విమానాలూ నడుపుతారుకదూ ! అల్లానే ఈ డ్రైవర్లను మనజీవితాల్ని నడుపుతారు. భర్తలు డ్రైవర్లు కారావిమిటి ? నిజంగా కూడా డ్రైవరు పనిచేస్తున్న వాణ్ణి పెళ్లాడుతున్నాను."

"అవును బావగారూ ! మన లలిత ఒక విమానం డ్రైవర్ని పెళ్లాడబోతున్నది !" అన్నాడు రామం.

"ఏమిటే లల్లీ ! నిజం !" అన్నది భద్ర.

"నిజం. "జాన్సన్" అని ఒక అమెరికన్‌ని పెళ్లాడుతున్నాను. విమానం పైలట్." అన్నది. నిదానంగానే.

"అమ్మతో చెప్పవా ?" అంది భద్ర.

"చెప్పాలి !" అన్నది లలిత.

నాకేమిటో బాధ అనిపించింది. మర్నాడు రామం, లలిత వెళ్లబోతుంటే, లలితని నా గదిలోకి పిల్చాను. దానికేమి భయంలేదు. నిర్భయంగా నా ఎదుట నించుంది.

"నిన్న చెప్పినది. నిజమా లల్లీ !" అన్నాను.

"దాన్ని గురించే ఆలోచించిస్తున్నావా, దేముడా?" పకపకా నవ్వింది.

"అసలు చెప్పుదూ ! అబద్ధంకదూ !" అబద్ధం అనుంటే నాకెంతో శాంతి ఉంటుందనిపించింది నాకు.

"అసలూ ఫాయిదాలతో చెప్తున్నాను స్వామీ ! నిజం ! నిజం—నీ విన్నది నిజం ! ఇంకేమిటి?" అన్నది.

నేను నిలవరించుకోలేక పోయాను.

"నా మాట వినవేలల్లీ ! అల్లాంటి వెధవపన్లు చేయకు ! నా మనసొప్పటంలేదు. అమ్మవింటే తల బాదుకుంటుంది. మన వాళ్లల్లో పెద్ద పొజిషన్‌లో ఉన్నవాళ్లు ఎంత మందిలేరు ! కళ్లకద్దుకుని చేసుకుంటారు నిన్ను !"

"బలేవాడివే నువ్వు ! నువ్వెలా సంధ్యని ప్రేమించావో, నేనూ అల్లానే "జాన్సన్"ని ప్రేమించాను. మనం ప్రేమైక జీవులంకద ! మన ప్రేమ వివాహాలు విజయవంతం అవ్వాలని అత్తయ్యని కోరుకుందాం." గట్టిగా నవ్వింది. దానికేదో పిచ్చిపట్టిందేమో అనిపించింది నాకు.

"నువ్వూ నేనూ సమానమా లల్లీ ! ఫారినర్స్‌కి వివాహంపట్ల పవిత్ర భావం లేదు. అదొక మోజు. అది తీరిపోగానే డైవోర్సు ఇచ్చేస్తారు. నేను సంధ్యని కంటికి రెప్పలా చూసుకోగలను. ప్రేమించటం తప్పుకాదు. కాని వైవాహిక వ్యవస్థలే వేరు అయిన వాళ్లని ప్రేమించితే అనవసర ఆందోళన తప్ప జీవితం సుఖంగా సాగిపోదు. అని నా భయం."

"ప్రేమ గుడ్డిది. బావా ! ప్రేమకి జీవితాలే అర్పణం అయిపోతాయి. అంతగా అతను, డైవోర్సు ఇచ్చేస్తే మళ్లి నాకు దొరికిన ఉద్యోగమేదో చేసుకుంటూ నిశ్చింతగా ఉంటాను. భారతీయ వనిత నైనందుకు ఏక పతివ్రతం వదలనులే ! ఆ భయం నీకొద్దు."

"జీవితం పందేనికి పెడుతున్నావా లల్లీ ! అత్తయ్య ముఖం చూసయినా ఈ పని మానెయ్యి. మవ్వీ పనిచేస్తే అత్తయ్య—నిన్ను పెంచి పెద్దచేసిన అత్తయ్య ఎంత కృంగిపోతుందో ఆలోచించు !"

"అయితే ఒక పని చెయ్యి ! చేస్తావా ?" నవ్వుతూనే అడిగింది.

"చెప్పు ! చేయటానికేం ?" అన్నాను ధీమాగా. ఏదో చెప్తుంది, చేయగలిగినదే అయి ఉంటుంది ఆ ఉపాయం, అనుకున్నాను.

"నన్నుకూడా నువ్వే పెళ్లాడెయ్యి !"

నిర్ఘాంతపోయాను. దానిమీద నా కెప్పుడూ ఆ తలపే కలగలేదు.

"అదెలాగే ?"

"అల్లాగే ! పూర్వం, అందంకోసం ఒకర్ని, గానంకోసం ఒకర్ని, పిల్లలులేరు అని ఇంకొకర్ని, పెళ్లాడేవారు కదా ? మన పురాణ పురుషుల్లో ఎంత మంది దక్షిణ నాయకులు లేరు ?"

"ఏ మ్మాటలు లల్లీ !"

"మంచి మాటలే ! యౌగంధరాయణుడు సామ్రాజ్య విస్తీర్ణతకోసరం, ఉదయనుడు పద్మావతిని పెళ్లాడేట్లు చేశాడు. ఒక్కొక్కళ్లకి ఒక్కొక్క కారణం. నీకూ కూడా. ఒక బంధువు పతన మవకుండా ఉండటంకోసం, చేసుకుని ఉద్ధరించేవనే ఒక కారణం ఉన్నది. ఇంక ఆలోచన ఎందుకు ?" ఆమె ముఖంలో విచారం కాని, నిర్వేదంకాని, లేవు.

"ఎల్లా మాట్లాడేస్తున్నావ్ లల్లీ ?" అంతకంటే ఏం అనాలో తోచలేదు.

"హుఁ, పాపం ! సంధ్యని వదలలేవు ! నా పతనాన్ని అంగీకరించలేవు. ఇరువురినీ సహించి, నీ నైతిక విలువల్ని కలుషితం చేసుకోలేవు. ఇంక ఒక్కటే తరుణోపాయం. నీ మీది ప్రేమవల్ల, నేను ఆత్మహత్య, చేసుకుని చనిపోతే, ఎంతో సానుభూతితో, నీకు పుట్టిన పాపాయికి, నా పేరు పెట్టుకుని, సంతోషిస్తావ్ ! అవునా ?"

"ఎంత లోకువగా అంటున్నావ్ లల్లీ !" బాధగా అన్నాను.

"అవునయ్యా ! మహానుభావా ! లేకపోతే నాకు నచ్చిన వాడివి, నేను హాయిగా పెళ్లాడేస్తే నీ కెందుకీ బాధ చెప్పు ! నిశ్చింతగా ఉండు. విష్ యూ గుడ్ లక్ !"

అవును. నాకెందుకు ? అది చెప్పగలిగితే ఇంకేం ? అదే నాలోని అలసత్వం. లలిత వెళ్లిపోయింది. వెళ్లిపోయాక అమ్మదగ్గర లలిత మాటలు చెప్పే ధైర్యం లేకపోయింది నాకు. భద్ర నాల్రోజులు అన్నం తినలేదు. ఇంట్లో ఎంతో ఉత్సాహంగా తిరిగేదల్లా ఒకమూల కూర్చున్నది. సంధ్య వాళ్ల వాళ్లింట్లో నాలుగు రోజులు గడిపింది. నాకు సంధ్యని మళ్లీ మైసూరికి తీసుకుపోవాలనిలేదు. ఆఫీసుకి వైరిచ్చి నాసామాన్లు అన్నీ అయ్యరుని పంపి పాక్ చేయించి తీసుకవచ్చాను.

"నువ్వక్కడుండవా ?" అన్నది సంధ్య.

"నేను రెండునెల్లు సెలవు పెట్టాను."

"అయితే నేను హాస్టల్‌లో రూంకి అప్లై చేసుకోవాలన్న మాట !"

"ఇంక చదవాల్సిన అవసరంలేదు లెద్దూ !"

"అదేమిటి ?"

"నువ్వేం ఉద్యోగాలు చేయాల్నా !"

"చేయకపోతే మటుకు ? డిగ్రీ తెచ్చుకోకుండా ఉండేందుకు నీ సహాయం కోరానా ? నాలుగు ప్రయివేట్లు చెప్పుకుంటే, నాహాస్టలు బిల్లు ఎత్తిపోతుంది."

"ఛీ ! అల్లా మాట్లాడుతా వెందుకు ! అమ్మ ముహూర్తం పెట్టిస్తోంది. అందుకని సెలవు పెట్టాను. ఈ హడావుడి అంతా అయిపోయేసరికి పరీక్షలు దగ్గరకొస్తాయ్. ఇంకేం చదవగలవు ? ఈ ఏడు "విత్ డ్రా అయిపోతే" నెక్ట్స్ఇయర్ తీరుబాటుగా చదువుకొని, క్లాసు తెచ్చుకోవచ్చును." లాలింపుగా అన్నాను. ఏం మాట్లాడలేదు. అమ్మ పురోహితుని కోసం కబురంపింది. భద్రతో మాట్లాడటానికి నా కెంతో మొహ మాటం వేసింది. చిన్నప్పట్నించీ, ఒకర్నొకరు హాస్యాలాడుకుంటూ ఎంతో స్నేహంగా పెరిగిన వాళ్లని, నేను విడదీశాను. సంధ్యని భద్ర వదినగా చూడలేదని నాకు తెలుసును. అమ్మకి మనసులో బాధగా ఉన్నా, నా సుఖ దుఃఖాలని కూడా యోచించి సరిపెట్టుకుంది. ఇంకా లలిత పెళ్లిమాట ఆమెకి తెలియనివ్వలేదు. లలితా, భద్రకూడా చెప్పి ఉండరు. అంచేత ఆమె "లలిత"కి దాని స్టేషన్‌కి తగిన సంబంధం తీసుకువచ్చి పెళ్లిచేయొచ్చు ననుకుని తృప్తిపడి ఉంటుంది. ఆ సాయంత్రం, నేనూ సంధ్యా, యూనివర్సిటీ గ్రౌండ్స్‌కేసి వెళ్లాం. బిల్డింగ్స్ అన్నీ చుట్టి తిరిగి వస్తున్నాం. "హల్లో గుడ్ ఈవెనింగ్ !" అంటూ రాహువు ప్రత్యక్ష మయ్యాడు. సంధ్యముఖం అతన్ని చూట్టంతోనే ధగధగా మెరిసిపోయింది.

"ఎల్లా వచ్చారు ?" అన్నాను. తప్పనిసరిగా విష్ చేస్తూ.

"జాలీ ట్రిప్ ! దేశం వదిలి పోబోయేముందు, దేవదర్శనం చేసుక పోదామని వచ్చాను. సంధ్యా ! ఆ రోజు చెప్పా పెట్టాకుండా వచ్చేశావేం ?" ఆతృత ధ్వనించింది అతని గొంతులో. సంధ్య ఏం మాట్లాడలేదు.

"అమ్మ ఫోన్ చేసింది, వచ్చేశాం !" అన్నాను.

"ప్రొద్దుట పైకి వెళ్తాను. వస్తావా సంధ్యా !"

"తప్పకుండా !" ఉత్సాహంగా అన్నది.

"ఎన్నిసార్లు చూడలేదు ? మళ్లీ ఎందుకు చలిలో !" అన్నాను.

"రానివ్వండి ! తన కంపెనీ సరదాగా ఉంటుంది నాకు !" అన్నాడు, నంజుండై. నాకు కోపం ఆగటంలేదు. అయినా అతను నన్ను గుర్తించటంలేదు. సంధ్య పరేసరి స్వప్న లోకంలో తేలిపోతున్నట్లు ఆమె చెంపల కెంపులే చెప్తున్నాయి.

"నీకోసం మంచి ప్రజెంట్ తెచ్చాను. సంధ్యా !" అన్నాడు.

ఏమిటో చూపెట్టకూడదా ?" చిన్న పిల్లలా గునిసింది.

నా కసహ్య మేసింది. అయినా ఏమనాలో తోచక ఊరుకున్నాను.

"అల్లారా ! మరి !" ఆకాశంలో చంద్రుడుదయించే వేళ సంధ్య అతని వెనకాతలే నడిచింది. నా ఉనికిని గమనించి నన్ను పిలవందే నేనెల్లా వెంట వెళ్లటం ?

దూరంగా వెళ్లి అక్కడున్న రాళ్ల గుట్టలమీద కూర్చున్నారు. వెన్నెల్లో ఏమిటో చూపెట్టాడు. సంధ్య పారిజాతాలు రాలినట్లు నవ్వుతోంది. నంజుండై ఉన్నావాడు ఉన్నట్లుగా సంధ్య నడుంచుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకుని ఆమె చెంపల్ని ముద్దుపెట్టుకున్నాడు. నా శరీరం జలదరించింది. రెండుమూడేళ్ల నిరంతర సాన్నిహిత్యంలో కూడా నేనల్లా ప్రవర్తించటానికి సాహసించలేదు. ఏమీ ఎరగనట్లు లేచి వచ్చింది సంధ్య! ఇంటికి వచ్చాక అతనిచ్చిన ప్రజెంట్ చూపించింది. గులాబీ రంగు అట్టమీద గురివింద గింజలతో సంధ్యపేరు తమిళం అక్షరాల్లో అంటించి ఉన్నది. నంజుండై చెల్లెలు చేసిందట ఆ పని !

"నాకు గురివింద గింజలంటే ఇష్టం అని అతనికి తెలుసును. కాలేజీకి పోయేదారిలో ఉండేది చెట్టు. ఆ గింజలు ఏరుకుని చెంగుకు కట్టుకునేదాన్ని. అవి ఇల్లా తయారు చేయించేడు."

"నీకు గురువింద గింజలంటే ఇష్టమని నాకూ తెలుసును. అతనితో నీకు చనువు ఉందని నేను గుర్తించలేదు." అన్నాను అపరాధిలా తల వంచుకుంది.

మర్నాడు సాయంత్రం నంజుండై మా ఇంటికి వచ్చాడు. కాఫీ ఫలహారాలు అయినాక సంధ్యకోసం అడిగాడు.

"వాళ్లింట్లోనే ఉంది !" అన్నాను.

"వాళ్లిల్లు ఇంకోచోట ఉందా ? ఇదే తన ఇల్లు అని చెప్పిందే నాతో !" ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును కొద్దిరోజుల్లో ఇదే ఆమె ఇల్లు అవబోతున్నది. ఆమె మా ఇంటి కోడలు !" మురిపెంగా అన్నది అమ్మ. నంజుండై నా వైపు చూశాడు. నేను అవునన్నట్లు తలూపాను.

"అరే ! మీరు ఆమెకి అన్నయ్య అవుతారన్నది !" ఇంకా ఆశ్చర్యపోయాడు నంజుండై. నాకు సంధ్య నాటకం, కొంచెంకొంచెం అర్థ మవుతోంది. ఇదే తన ఇల్లు అనీ, నేను ఆమె అన్నయ్యననీ చెప్పి, నంజుండైని బుట్టలో వేసుకొంటూందన్నమాట ! తన ఇంటికి ఇతన్ని తీసుక వెళ్తుంది ? అతని దగ్గర తన బీదతనం, బయట పడిపోదూ ?

"ఎప్పుడూ మిమ్మల్ని గురించి చెప్పలేదు తను." విచారంగా అన్నాడు నంజుండై. అతని ముఖం దీనంగా ఉంది. లక్షాధికారి బిడ్డ అతను ! తండ్రి మద్రాసులో వజ్రాల వ్యాపారస్థుడు ! సంధ్య ఆశ యింక ఫలించిందన్నమాట ! నా కంటే ఆర్థికంగా చాలా గొప్పవాడు. అతని ముందు తన అరిస్టోక్రసీని ప్రదర్శించటానికి నేను ఉపయోగపడ్డాను. ఆడది తల్చుకుంటే చేయలేని దేముంది ?

"వస్తాను. రేపు పదిహేనో తారీఖున "బాంబే"లో బయలుదేరుతోంది ప్లేను. ఇద్దరికీ పాస్‌పోర్ట్సులూ అవీ రెడీ చేశాను. ఇల్లా మీతో సంబంధం రెడీగా ఉన్నదని నాతో ఎందుకు చెప్పలేదో, నా కర్థంకావటంలేదు. ఇంక ఆమెని చూడ దల్చుకోలేదు !" నిర్వేదంగా వెళ్లిపోయాడు నంజుండై.

అమ్మయ్య ! అనిపించింది. నాకు. అంత చేసినా, అల్లాంటి దౌర్భాగ్యపు ప్రవర్తనని తెలుసుండే కూడా సంధ్య మీది మమకారం వదుల్చుకోలేక పోయాను. నాదగ్గరుంటే సంధ్య చాలా బాగుపడుతుందని నా నమ్మకం. ఆమెలో ఉండే ఆకర్షణ అనంతమైంది. సాయంత్రం సంధ్య మా ఇంటికి వచ్చింది. వచ్చీ రావటంతోనే

"నువ్వు "నంజుండై"తో మనిద్దరం పెళ్లి చేసుకుంటున్నామని చెప్పావా ?" అని అడిగింది

"అవును." అన్నాను.

"అతను నన్నెంతగా ప్రేమించాడో నీకేం తెలును ? ఎంతగా కుమిలిపోతాడో కదా ! నీ కెదుటివాళ్ల బాధ అర్థం కాదు." అన్నది.

"అబద్ధం ఎల్లా చెప్పను సంధ్యా ! అతను మీ ఇద్దరికీ కలిపి పాస్‌పోర్ట్సు తయారు చేశాడుట పాపం ! అతనితో అమెరికా వస్తానని చెప్పి, నాతో కళ్యాణానికొప్పుకున్నావు."

"నీ వేళాకోళాని కేమికాని, అతను చాలా బాధపడుతాడు. నేనంటే ఎంత ప్రేమో నేను చెప్పలేను." కాబోయే భర్తతో ప్రేమికుడి ప్రేమను గురించి చర్చించగల సాహసికురాలు సంధ్య!

నేను "ఎంత ప్రేమించినా హద్దులు మీరటం ఇష్టం ఉండదు నాకు" అన్నాను. సంధ్య నవ్వింది.

"నీకు కోపం వస్తే రావచ్చును. నీలో ఆ సాహసం లేదు. సాహసం లేనివాళ్లు, మనం నిర్మలులం అని గర్వపడుతూ, మనస్సుని జోకొట్టుతారు. ప్రేమించానని చెప్పి, పెళ్లాడబోతూన్న అమ్మాయిని స్పృశించితే హద్దులు మీరటం అయిపోతుందా ? ప్రేమించి పెళ్లాడటం ఇంతేనా ?"

"అల్లాంటి అపవిత్రతని, నాజూకుగా తీసుకుంటారు నీవంటివాళ్లు. నాకు నీసంగతి తెలుసుండీ నిన్నంగీకరిస్తున్నానంటే, ఆ రోజు నీవన్న మాటలే ! జ్ఞాపకం ఉందా ? నీతో ఇన్నాళ్లుగా జరగని అకార్యం "నంజుండై"వల్ల జరుగుతుందా! అన్న దాన్నించే నిన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తున్నాను. ఇంక ఆ ప్రశంస తేకు." అన్నాను. ఏమీ మాట్లాడలేదు సంధ్య. వారం రోజులు గడిచాయి. ఇంక "నంజుండై" బయలు దేరటానికి నాలుగు రోజులుందనగా, సంధ్య బొంబేకి ప్రయాణమైంది.

"ఈ నాలుగురోజులూ అతనితో గడపలేకపోతే నిలవలేవన్నమాట ! నీకిది మర్యాదగా తోస్తూందా ?" అన్నాను. కోపంగా.

"మర్యాదా, మంచీ తర్వాత ! అతను చెంబూరులో మేనత్తగారింట్లో ఉన్నాట్ట ! నన్నిప్పటికయినా క్షమించుతాడట. నేను వెళ్తే సంతోషంగా స్వీకరిస్తాడట."

అయితే అతనికి "సెండ్‌ఆఫ్" ఇవ్వటానికి కాదన్న మాట ! నువ్వు బయలుదేరుతోంట !" నిర్ఘాంతపోతూ అడిగాను.

"అంత ఉదారత నీలోలేదు పద్మనాభం ! మనిద్దరం ఒక చోట ఉంటూండటం చూసి కూడా ఇంకా నేను కావాలనుకోవటంలో అతని హృదయవైశాల్యం ప్రస్ఫుటమవటం లేదా !

"నేను నాలుగు రోజుల్నుంచీ ఇదే ఆలోచిస్తున్నాను. అతన్ని ఎల్లా క్షమాపణ కోరుకోవాలో తెలియటంలేదు. ఇంతలో అతనే ఫోనుచేసి చెప్పాడు. నీకు నా మీద మోహం తప్ప ప్రేమలేదు. నేను డబ్బులేనిదాన్ని కనుక, నీ చెప్పినట్లు వింటూ పడి ఉండాలి అనిపిస్తూంటుంది నీకు ! ఇంక ఈ సంబంధం స్థిరమైనదైతే, నీ, ఆధిక్యత వెర్రితలలు వేయవచ్చుకూడా. ఇంక మీవాళ్లకి అవ్వాల్సిన మేనకోడలి స్థానంలో నిర్ధనురాల్ని, నేను నిలబడ్డానన్న జెలసీ ఉండనే ఉంటుంది. నీ అహంభావంలో, వాళ్ల ద్వేషాసూయల్లో, నేను బాముకునే సంసార సుఖం ఏముంటుంది ?"

"అయితే ఈ లోపాలు, నంజుండై ఫామలీలో ఉత్పన్న మవటానికి అవకాశములు లేవేమిటి ?" కచ్చగా అడిగాను.

"అవకాశము ఉంటే నేను నిన్ను వదులుతానా ? నం జుండ్రైకి తల్లీ తండ్రీ లేరు. ఇన్నాళ్లూ నీకు మల్లేనే అతనికీ ఒక పెళ్లికాని చెల్లెలు బాధ్యత ఉండేది. ఇప్పుడు అదీలేదు.'

"ఆ అమ్మాయికి పెళ్లయిపోయిందా ?"

"ఆ ! అయ్యింది. ఏకంగా దేముడితో అయ్యింది పెళ్లి !" నవ్వుతూ అంది సంధ్య.

నా ఒళ్లు జలదరించింది. ఆ అందం అమృత భాండం కాదు. విషలిప్తం ! ఆ నవ్వు వెన్నెలలు చిందించేది కాదు ! ఎదుటి మనుష్యుల్ని రక్తం కక్కుకుని పడిపోయేట్లు చేసేది ! ఆ వెడల్పాటి కన్నుల్లో బంధుప్రీతి కాని, కరుణకాని పల్క రించదు ! తన సౌందర్యంతో ఎంత మందిని బలిపెట్ట కలనా అని గుండుసూదుల్లా చూస్తుంటాయ్ ఆమె లాలసత్వంతో నిండిన మెరక కళ్లు !

"ఒట్టి కృతఘ్నురాలివి !" అన్నాను. ఏమనాలో తోచక.

"ఎవళ్ల బాగు వాళ్లు చూసుకోవటం కొంతమందికి, కృతఘ్నతగా తోస్తుంది. నీలాంటి వాళ్లు వట్టి నిర్భలులు. ఏదో కీర్తి కాముకత్వంతో శరీరాలు మరిచి పోవటం, దాన్ని మాలాంటివాళ్లు లెఖ్క చేయకపోవటంతో, చేతులు ముడు చుకు ఏడుస్తూ కూర్చోటం. అంతకన్నా ఏం చాత కాదు." అన్నది. సంధ్య అప్రయత్నంగా మా భద్రి జ్ఞాపకం వచ్చింది. అమ్మ, నన్ను కనురెప్పల్లో పెట్టుకుని కాపాడుకొం టున్న అమ్మ, నిత్యం, నాకోసం, నా వంశాభివృద్ధికోసం భగ వంతుని ప్రార్థించే అమ్మ నా మనసులో నించున్నది. లలిత బొమ్మ, మసక మసకగా, వెలిసిపోయిన చీరలా రెపరెపలాడు తున్నది. సంధ్య నిర్గమనంలో నాకు ఆడపిల్లలమీద నమ్మకం సడలిపోయింది. వాళ్లకి స్థిరత్వ ముండదు. 'క్షణక్షణ ముల్, జవరాండ్ర చిత్తముల్,' అని వూరికే వ్రాయలేదు. అనుకున్నాను. కాని అనుభవంలో అదీ నిలవలేదు. నిన్నూ, మా భద్రినీ చూట్టంతో మళ్లీ ఆలోచన్లు కలగక మానవు."

'భద్ర ?" ఆలోచనగా చూసింది మణి.

"అవును. భద్ర విషయం నీకు తెలీదు. రామం గురించి విన్నావుకదూ ? రామం లలిత పెద్దతల్లి కొడుకు. స్వామి కల్యాణం ఉత్సవాలకి వచ్చాడు. లలిత అనాలోచితంగా రామం భద్రకలిసి స్నానాలు చేయొచ్చు అన్నది. ఆ రోజు తర్వాత ఆకోరిక భద్ర మనస్సులో ఎల్లా గూడ కట్టుకున్నదో, మాకెవ్వ రికీ అవగతం కాలేదు. స్కూలు ఫయినల్ ప్యాసయింది ఆ ఏడు. కాలేజీలో సీటు వచ్చింది. మొదటివారం రోజులూ, పాఠాలు మొదలెట్టరు కనుక వెళ్లటం లేదనుకున్నాను. జీతం కట్టేశాడు గుమాస్తా. పదిహేను రోజులకి కాబోల్ను, అది ఇంక కాలేజీకి పోటంలేదని తెలిసింది.

"ఏమే ? చదవాలని లేదా ?" అన్నాను.

"ఏం చదివీ ఏం లాభం ? వచ్చింది చాల్ను !" అన్నది. అప్పటికింకా "లలిత"ని నేను కాదన్నాననే కోపాగ్నిలోనే ఉంది.

"ఇంట్లో కూర్చునేం చేయదల్చుకున్నావ్ ?"

"అందరాడాళ్లూ చేసేదే చేయదల్చుకున్నాను !"

దాని మొండితనానికి నాకు వళ్లు మండింది.

"కొందరాడాళ్లు పేడచేసి పిడకలమ్ముకుంటూ బ్రతుకు తున్నారు. నువ్వాలా చేస్తావా ?"

భద్రకి రోషం వచ్చింది.

"ఆ పరిస్థితి వస్తే అల్లా చేయగల శక్తి అప్పుడే ఉత్పన్న మవుతుంది. ఏ యెండకా గొడుగు పట్టగల సమర్థత స్త్రీల కున్నట్లు, పురుషులకుండదు. అయినా ఇది నాన్నగారి సంపద! నీ కెంత హక్కువుందో నాకూ అంత హక్కూవుంది!"

'హక్కు భుక్తాలలవరకూ వచ్చిందన్న మాట వ్యవహా రం" అన్నాను. ఉద్రేకోషంతారస్థాయిలో పెంచుకుంటున్న వాళ్లతో మాట్లాడితే, పెద్ద యుద్ధం జరగటం తప్ప ప్రయోజనం ఉండదు. మాటకి మాట తెగులు ! అందుకని ఊరుకున్నాను. తర్వాత అమ్మని అడిగాను.

"అది చదువుకోనుమొర్రో అంటూంటే మనం ఏం చేయగలం !" అన్నది.

"అయితే ఏమన్నా మంచి సంబంధాలు చూడమ్మా ! పెళ్లి చేసేద్దాం !" అన్నాను.

"మంచి కెక్కడికి ? కొండమీద ఎల్లానూ అనుకోనే అనుకున్నారుకదా ! ఆ రామానికిచ్చేస్తే సరిపోతుంది !"

"రామానికా !" ఆశ్చర్యపోక తప్పలేదు నాకు. రామం లలితకి అన్నయ్యవుతాడు. అంటే పెదతల్లి కొడుకు. రామా నికి ఆస్తి ఏమీలేదు. యల్. యమ్. ఇ. ప్యాసయినాడు. ఆటోమొబైల్, కంపెనీలో చిన్న ఉద్యోగం చేసుకుంటు న్నాడు. మా భద్రి ఒక్కగా నొక్క పిల్ల. బోలెడు కట్న కానుక లిచ్చి పెద్ద హోదాలోఉన్న వరుణ్ణే తేవచ్చును. అమ్మ ఎందుకంత నిర్లక్ష్యంగా రామానికిచ్చేద్దా మనుకుంటున్నదో నా కవగాహన కాలేదు. ఏ విధంగా చూసినా రామం, మా స్టేటస్‌కి తగినవాడు కాదు.

"ఇంతకన్నా గొప్పవాడు మనకు దొరకడా అమ్మా !" అన్నాను.

"విద్యా ధనాలకి అంతెక్కడనాయనా ! మనసులు ముఖ్యం కాని, మనుష్యుల సంపద ముఖ్యమా ?"

సుభద్ర ఎప్పుడు వచ్చిందో వెనకాతల నించుంది కాబోల్ను.

"అంతకన్నా అందమైనదీ, తెలివైనదీ దొరకదనేగా సంధ్యని పెళ్లాడుతున్నావ్ !" అన్నది.

"నేనూ నువ్వు ఒకటేనా ? మనింటికి వచ్చేది ఆడదయితే, మనతోపాటు సర్దుక పోతుంది. ఇంటి కోడల్ని సమాన ఫాయిూలో ఉందా లేదా, అన్న జిజ్ఞాసతో వెతుకులాడక్కర్లేదు. కాని మన ఆడపిల్లనిచ్చేటప్పుడు మటుకు, సమాన ఫాయీలో ఉన్నవాళ్ల కోసం వెతుక్కోవాల్సిందే ! ఇక్కడ నలుగురు పనిమనుష్యుల మధ్య అపురూపంగా పెరిగే నీవు, నీవంట నువ్వు చేసుకోవటం, నీ బట్టలు నువ్వు ఉతుక్కోవటం చేయకలవా ? అలాంటి పనులు చేయక తప్పని స్థితుల్లో పెరిగిన ఆడపిల్ల నలుగురూ పనివాళ్లని మెయిన్‌టైన్ చేస్తున్న ఫామిలీలో కోడలుగా రావటం సంభవించితే, ఆ పిల్ల అనంత తృప్తితో జీవిస్తుంది. ఇచ్చేటప్పుడు, మనకంటే ఎక్కువ వాళ్లకి ఇయ్యాలి. పుచ్చుకునేటప్పుడు తక్కువ వాళ్లయినా పరవాలేదు."

"మంచి స్పీచ్ ఇచ్చావ్ ! నేను రామాన్ని ప్రేమించాను. అతన్నితప్ప, ఇంకెవర్ని పెళ్లాడను." ధృఢంగా అన్నది భద్ర. నిశ్చయంతో దానికళ్లు మెరిశాయి. నిండా పదహారేళ్లు లేవు. అప్పుడే అంత పట్టుదల ఎలాకలిగింది దానిలో ! నిజమే ప్రేమకి అంతస్థు లేమిటి ? నాకు చెల్లెలు కాదా ! తను ? నా పెళ్లి ముహూర్తానికి ముందే దానికి ముహూర్తం పెట్టేద్దామనుకున్నాం. కాని, రామం ఒప్పుకోలేదు. తను ఎ. ఎమ్. ఐ. ఇ. కి కట్టి ప్యాసయితేకాని చేసుకోనన్నాడు. రామానికి లలిత ధన సహాయం చేస్తోందిట. రామం పగలు ఉద్యోగం చేసుకుంటూ రాత్రిళ్ల ప్రైవేటుగా చదువుకునేవాడు. ఇప్పటికింకా కొన్ని పార్టులు కట్టాల్సి ఉంటుంది అనుకుంటాను.

సరే ! నా పెళ్లి సంధ్యతో అవ్వాల్సింది అల్లా చెడిపోయింది. ఆ పెళ్లి చెడిపోయినందుకు అమ్మా, భద్ర సంతోషించా రనుకుంటాను. వెంటనే లలితకి, టెలిగ్రాం ఇచ్చేరు. లలిత వచ్చింది. అమ్మా, భద్రీ ఈ విషయం అంతా చెప్పేరు. లలిత వాళ్లతో "బావతో ఒంటిగా మాట్లాడితేనే కాని చెప్పలేను." అన్నదిట. సరే అన్నారుటవాళ్లు. నా దగ్గరకొచ్చింది.

"ఇల్లా అవుతుందనుకోలేదు." అన్నది.

నాకసలే మనస్సు స్థిమితంగాలేదు. అల్లాంటిది లలిత వగచినట్లూ వాతపెట్టినట్లూ మాట్లాడటంతో, కోపం వచ్చింది.

"నీ ఓదార్పు నా కనవసరం !" అన్నాను.

"అనవసరం అనుకోనుంటే, అత్తయ్యా వాళ్లూ నన్ను పిలిపించక పోదురు."

"జాలితలిచి వచ్చేనన్నమాట !"

"అదైనా నీ మీద కాదు బావా ! అత్తయ్య కోసం. చిన్నప్పట్నించీ అత్తయ్య పొట్టలో తలపెట్టుకుని నిద్రపోయిన సుఖాన్ని మరిచిపోలేక, వచ్చాను. ఏ అదృష్టానికైతే, నిన్నున కాలదన్ని, సంధ్య వెళ్లిపోయిందో, అల్లాంటి అదృష్టాన్నే, నేను కాలదన్నుకుని, అత్తయ్య మనశ్శాంతి కోసం వచ్చాను. పెంచిన అత్తయ్యకోసం నేను చేయగల త్యాగాన్ని, కన్నతల్లి కోసం నువ్వు చేయలేకపోయావు. దానంతట అది తృణీకరించి వెళ్లిపోయింది కనుక, మళ్లీ నాకేసి తిరిగావు. విదేశీయుడైనా, "జాన్సన్"లోని నిజాయితీ, నీలో ఉన్నదా ? జాన్సన్ సంవత్సరం పొడుగునా, నాకోసం ఆగుతున్నాడు. నువ్వు ? సంధ్య మోహంలో నన్ను తీసిపారేశావు. సంధ్య నంజుండైని ప్రేమిస్తుందన్న భయంతో ఆమెని, వివాహానికి ఒత్తిడి చేశావు. దానితో నంజుండై పైది మోజు పెరిగింది సంధ్యకి. నువ్వు దేనికయితే భయపడ్డావో అదే జరిగింది. ఇంత చలచిత్తంకల వాడిని నీకు మనస్తిమితం ఎల్లా ఉంటుంది.? మనసులకి మనుష్యులు ముఖ్యంకాదు. స్థిరమైన మనస్సు స్నిగ్ధ స్నేహపూరితమైన హృదయంకల ఏ వ్యక్తినైనా స్త్రీ ప్రేమించి పూజించకలదు. నీలో అదిలేదు. నీకీ జన్మలో, స్త్రీ ప్రేమ లభ్యంకాదు. ఇంక సంసారిక జీవితం అంటావా ? ఎవరో ప్రాణంలేని గుడ్డబొమ్మ దొరక్కపోదు. కనుక లోపం ఉండదు."

నాకు బాధకలిగింది.

లలితా ! నాకు నీ మీద కోపం ఏమీలేదు. నాకు నీమీద కోర్కెకూడా లేదు. అమ్మతో నేను సర్దిచెప్పుతాను. నువ్వు జాన్సన్‌ని సంతోషంగా పెళ్లాడొచ్చును." అని అమ్మతో సంగతి సందర్భాలు వివరించేను. అమ్మ లలితని ఎన్ని విధాలుగానో లాలించింది. అయినా లలిత ఒప్పుకోలేదు. భద్రకూడా ఎంతగానో బ్రతిమలాడింది. అయితే లలితకి మనసు మారలేదు. నేను ముభావంగా ఊరుకున్నాను. వెళ్లేటప్పుడు లలితతో అన్నాను.

"నేను నీ ముందు ప్రాధేయపడితే అంగీకరిద్దామన్న ఉద్దేశ్యంతో వచ్చావు. ఓడిపోయి వెళ్లిపోతున్నావ్ !"

లలిత గర్వంగా నవ్వింది.

"నేను గెలిచే వెళ్తున్నాను. బావా ! ఓడిపోయినది నువ్వే ! ఆడది ఆటవస్తువు అనుకున్నావ్ ! కాదని నిరూపించేను. నా వ్యక్తిత్వం ఋజువు పరుచుకున్నాను. ఇంక నీ వ్యక్తిత్వం నువ్వు నిరూపించుకో !"

సంవత్సరంపాటు సెలవుపెట్టి దేశంఅంతా తిరిగాను. అమ్మకి మనశ్శాంతి ఉండదు. అని నాకు తెలుసును. ఆమె ముఖం చూడలేకే నేను దేశాలు తిరిగాను. సరే ! తర్వాత అమ్మ నా పెళ్లికోసం చేసిన ప్రయత్నంలో నువ్వు దొరికావు. ఆ సంగతంతా నీకే తెలుసుకదా ?" అమ్మకోసమే, నాలో పెళ్లాడాలనే వాంఛ చచ్చిపోయినా, పెళ్లికి ఒప్పుకున్నాను. నీతో నా బలహీనతంతా వెల్లడిచేసుకోవాలనే కోర్కె ఈ సంవత్సరం నించీ నాలోమెదులుతూనే ఉంది. ఎప్పుడూ నా కళ్లబడే దానివికాదు. సాధారణంగా ప్రతిస్త్రీ,తన పురుషుణ్ణి ఆకర్షించకోటానికి, విశ్వ ప్రయత్నాలూ చేస్తుంది. అందులో,

విముఖంగా ఉన్న భర్తపట్ల భార్యకి, ఎక్కువ శ్రద్ధా సక్తులు కలుగుతూంటాయి అల్లాంటిది, నీవు, ఒంటిగా కంటికి కనబడకుండా, ఏం చేస్తుండేదానివా ? అనే ఆలోచన కలిగేది. ఒకే ఇంటిలో ఉంటూ ఒక ర్నొకరు చూచుకోకుండా, కాలం గడపగల్గే మంటే, నా ఆసక్తికి కన్నా, నీ నిరాసక్తతకే, ఎక్కువ ప్రాధాన్య మివ్వాల్సి ఉంటుంది. నీలో అంత నిరాశక్తత ఎందుకు ప్రబలిందో ! దానికి మూలకారణం, ఏమిటో నాకు తెలుసుకోవాలనిపించింది కూడా. అందుకనే ఇవ్వాళ ఇల్లా..." పద్మనాభం నాగమణి వేపు చూశాడు. ఆమె చెంపలమీద స్వేద స్ఫటికాలు జారుతున్నాయి. చటుక్కున లేచి, దగ్గరగా వెళ్ళి భుజంమీద చేయివేసి "ఎందుకూ ?" అన్నాడు.

"ఏంలేదు." చెంగుతో కళ్ళు అద్దుకుంది. తెల్లవారబోతున్నది. మైకులో సుప్రభాతం వినపడ్తోంది. ఒక్కొక్క కాటేజీలోనూ, దీపాలు ఆరిపోతున్నాయి. పాపాలు, పారిపోతున్నాయి. ఆ ప్రశాంత సమయంలో కాటేజీ వరాండాలో నించుని, ప్రత్యూష పవనాలకి పులకరించిపోతూ, ఆనంద విమానాన్ని చూస్తూ, సుప్రభాతం వినగలగడం, జీవితవరంగా భావించొచ్చును. నాగమణిలేచి లైట్ తీసేసి వరండాలోకి వచ్చి నిలబడింది. పద్మనాభం కూడా వెనకాతల వచ్చి నించున్నాడు. "పాలమ్మా పాలు" అంటూ గొల్లవాళ్ళు ఆవుల్ని దూడల్ని తోలుకొని వస్తూ అరుస్తున్నారు. కావల్సినవాళ్ళు పితికించుకుంటున్నారు.

"నిద్ర తేలిపోయింది నాకు. నీకు నిద్ర వస్తోంటే కారులో పడుక్కో !" అన్నాడు పద్మనాభం.

"నాకూ నిద్రరావటంలేదు. అసలు రాత్రిళ్ళు నిద్రపోయే అలవాటు నాకు తప్పిపోయి చాలాకాల మయింది." అన్నది నాగమణి. పద్మనాభం బాధగా నిట్టూర్చాడు.

"డ్రైవరు బట్టలు తెచ్చేలోగా నాగురించి చెప్తాను. వింటారా ?" అన్నది.

"అంత కంటేనా ?" కూర్చున్నాడు. నాగమణి కూడా కొంచెం ఎడంగా మెట్ల మీదకు కాళ్ళు జార్చుకుని కూర్చున్నది. చల్లని చిరుగాలికి నాగమణి శరీరం గజగజ వణికింది. రెండు తుమ్ములు తుమ్మింది. గొంతు భారంగా ఉన్నది.

"మన మొదటిరాత్రి జ్ఞాపకం ఉన్నదా మీకు ?" అన్నది.

"లేకేం ? అసలు ఈ కథంతా ఆ నాడే నీతో చెప్పేయాల్సింది. నాకు మనోనిబ్బరం లేకపోయింది. నీ ముందు, నేను మహాపరాధం చేసినవాడిలా అయిపోయాను. నిర్మలంగా, స్నిగ్ధ సుకుమారంగా కనపడే, ఆ మలిన కథంతా విశదపరిచి, నీ లేత మోములో విషాద నీడలు పరవటానికి నా మన సొప్పలేదు."

ఆ రోజు ముత్తయిదువలు నాగమణిని తీసుకవచ్చి గదిలో విడిచిపెట్టగానే, అయిదు నిముషాలు నాగమణి వేంపు చూస్తూ నిలబడ్డాడు. నాగమణి తల కొద్దిగా వంచి తలుపు కానుకుని నించున్నది. ఏదో మాట్లాడబోయి ప్రక్క తలుపు తీసుకుని మేడమెట్లు దిగి తోటలోకి వెళ్ళిపోయాడు. నాగమణి ముందు ఆశ్చర్యపోయింది. తర్వాత గుమ్మందాకా వెళ్ళి వెన్నెల్లో కలిసిపోతున్న అతని ఉన్నతమైన ఆకారాన్ని చూస్తో నించుంది. చెట్లనీడల్లో, అతని నీడకూడా కలిసిపోయేక తలుపు వేసుకుని లోపలికి వచ్చి పడుక్కుంది. ఆ రోజునించీ ఆమె ఆ గదిలో ఒంటిగా పడుక్కుని గంటలగంటల కాలం, నిర్లిప్తంగా కేవలం ఆలోచనాకాక, ఆవేదనాకాక, ఒకవిధమైన, అంతర్ దృష్టితో పరిశీలనగా, గడిపేది !

"ఆ రోజు నీవు మౌనంగా, ఎంత దుఃఖాన్ని, హృదయగతం చేసుకున్నావో ఈ రోజు తలుచుకుంటే, ఎంతో సిగ్గు వేస్తోంది మణీ !" అన్నాడు. పద్మనాభం.

"అంతబాధ అనవసరం ! నేను చెప్పబోయే నా జీవితం వింటే, ఈ వ్యక్తిని గురించి నే నెందుకు శ్రద్ధ తీసుకోవాలీ ! అన్న పట్టుదల మీలో కలిగి తీరుతుంది" అన్నది. ఆమె కంఠధ్వనిలో కొంచెం హాసభావం తొణికిస లాడింది. పద్మనాభం చకితుడైనాడు.

"అదేం ?"

ఆ ప్రశ్నకి జవాబు రాకమునుపే, దిగువ తిరుపతి నుంచి కారూ డ్రైవరూ వచ్చారు. ఎదుటి కొండలమీది చింపిరి మొక్కల చివర్లలో ఉషః కన్య లేత నవ్వు సుకుమారంగా కదులుతోంది.

"స్నానాని కెళ్దామా ?" అన్నది.

పద్మనాభం నాగమణి వేపు శూన్య దృష్టితో చూశాడు.

"పదండి !" అన్నది మళ్లీ.

"నాకు చలివేస్తోంది. వేణ్ణీళ్ళ తెప్పిస్తాను. స్నానం చేద్దాం !" అన్నాడు.

"నేను పుష్కరిణిలో చేస్తాను. మీరిక్కడకు వేణ్ణీళ్ళ తెప్పించుకుని చేయండి." అన్నది.

భద్ర పంపించిన బట్టల బ్యాగ్ తీసి బొటన వ్రేలంత జరీ అంచు ఉన్న తెల్లని సిల్కుపంచె, ఖండువా, పద్మనాభాని కిచ్చింది. పద్మనాభం, టవల్ తీసుకుని బాత్ రూంలోనికి వెళ్ళిపోగానే, నాగమణి, పుష్కరిణికి వెళ్ళి స్నానం చేసి వచ్చింది. దోసెడు వెడల్పు జరీఅంచు నీలం పట్టుచీర, ఎర్రని జరీ గళ్ళ పట్టురవికె తొడుక్కుని వరాండాలోని లేత ఉదయ కాంతిలో పొడుగాటి జుట్టుని, సన్నని వ్రేళ్లతో చిక్కు తీసుకుంటూ నించున్న, భార్య ఆకృతి, పద్మనాభం హృదయంలో గాఢంగా ముద్రవేసికొంది. పవిత్ర స్థలాల్లో పవిత్ర భావాలే కలుగుతాయ్. స్వామి దర్శనం చేసుకోగానే పద్మనాభం, గుండెల్లో గూడుకట్టుకున్న బరువంతా, దూది పింజలే ఎగిరిపోయింది. సౌమనస్విని అయిన భార్య తన సుఖదుఃఖాల్లో

ఆమె సుఖదుఃఖాలుగా ఎంచుకునే తల్లీ, అన్నఇల్లు పది ఇళ్ల మొదలవ్వాలని, మనసారా కాంక్షించే భగినీ తన కేం లోటు ? తనే, అనవసరంగా ఇంతటి ప్రశాంత జీవనం వదలుకుని, తనలో తనే, తీరని వ్యథతో రోజుల్ని వృధా పుచ్చాడు ! అన్న ఆలోచనతో అతని హృదయం పరిప్లావితమై, ఆనంద తరంగితమైనది. నాగమణి వేపు ఆర్ద్రనయనాలతో చూస్తూ ముగ్ధుడైపోయాడు ! ప్రదక్షిణం చేసి వస్తూండగా, ఒక చోట ఎవరో కూర్చుని పాడుతున్నారు. అన్నమాచార్యుని కీర్తన "ఆకటివేళల, అలపైనవేళల, వేకువ హరినామమే దిక్కు మరిలేదు !"

ఇంటికి వచ్చేసరికి ప్రఫుల్ల వదనాలతో తల్లీ చెల్లెలూ గుమ్మంలో స్వాగతమిచ్చారు. ఆ రోజున, నాగమణి ఇంటి నిండా సంతోషంగా ఆహ్లాదకరంగా తిరుగుతుందనుకున్న సుభద్ర, నాగమణి మామూలు మౌనంతోనే ఇంటిపనుల్లో నిమగ్న మయిపోవటం చూసి, కొద్దిగా చలించింది. అయినా, ఆమెతో ఎల్లా మాట్లాడితే, విషయం, సులభగ్రాహ్య మవుతుందో అంతుపట్టలేదు భద్రకి తల్లితో సంప్రదిద్దామా అంటే, తనకి చిన్నతనంగా ఉంటుంది. ఎంత తల్లి అయితే మటుకు, వదిన సంసారిక సౌఖ్యముగూర్చి చిన్నపిల్ల తను ప్రస్తావించటం బాగుంటుందా ? తనలో తనే రోజల్లా మిల్లాగుల్లాలు పడింది సుభద్ర. రాత్రి భోజనాలయినాక, అన్నయ్య పేపరు చదువుకుంటూ, హఠాత్తుగా లేచి, మేడ మీదకు వెళ్లటం, తన గది కిటికీలోంచి చూసి, "అమ్మయ్య !" అనుకుంది. ఎంతయినా, నూతన ప్రియ సమాగంవల్ల, లజ్జ పుట్టుకవస్తుంది కాబోల్ను. ఇంటికికోడలుగా రావటం అయితే, రెండు సంవత్సరాలయింది కానీ, భర్తన బడుతూన్న వ్యక్తి, పలకరింపుల చిలకరింపులు, ఆ "యౌవని"కి క్రొత్తే కదా ? అందుకనే, జయదేవకవి, "ప్రథమ సమాగమ లజ్జితయా, పటు చాటుశతై రనుకూలం ! అన్నాడు !" భద్రి ఆలోచిస్తూనే నిద్రపోయింది.

తలుపులు జేరవేసుకుని మంచంమీద బోర్లగిల పడుక్కుని, ఆకాశంలోని కృష్ణపంచమి చంద్రుణ్ణి చూస్తూన్న నాగమణి, పద్మనాభం తలుపు త్రోసుకుని వచ్చిన సవ్వడికి లేచి, మంచందిగి నించుంది. పద్మనాభం చిరునవ్వు నవ్వుతూ, తలుపులు లాగి గడియపెట్టాడు. సోఫాలో కూర్చున్నాడు.

"మంచి నీళ్లు కావాలా ?" అన్నది నాగమణి.

"వద్దు ! మీ ఆడవాళ్ళు మగాళ్ల దాహాల్ని ఇట్టే గుర్తిస్తారనుకుంటాను !" పరిహాసంగా అన్నాడు పద్మనాభం.

పేలవంగా నవ్వింది నాగమణి.

"నా గురించి మీరు వినొద్దు !" ఆమె గుండెల్లోని, ఏదో నిష్కారణ భయం జరజరా వెన్నులో ప్రాకింది.

"చెప్పు మరి !

"విని కూడా నన్ను భరించకలరా ?"

"నేను భరించలేని విషయం ఈ పృథివిమీద లేదు మణీ !"

ఆందోళనగా అన్నాడు. మణికి బాధ కలిగింది. తన వల్ల జరిగిన ప్రతి చిన్న విషయాన్నీ, అతను దాచక తనతో చెప్పుకున్నాడు. అంత మంచి మనస్సుని తనిప్పుడు, వంచించ పోతోంది. దీనివల్ల లాభనష్టాల మాటెల్లా ఉన్న, తన గుండెలకి రంపపుకోత మాత్రం అవక తప్పదు.

"ఇన్నాళ్ల నా నిరీక్షణలో, మీ నుంచి లభించిన అప్యాయతని, పోగొట్టుకోలేను." తనలో తనుగా అనుకున్నమాట పద్మనాభం విన్నాడు.

"నీ నుంచి ఎల్లాంటి కష్టవార్తలైనా వినటానికి సిద్ధంగా ఉన్నాను మణీ ! ఈతకన్న లోతులేదు ! గోచీకన్న దరిద్రంలేదుట !"

"అదుగో ! అప్పుడే కష్టంగా మాట్లాడుతున్నారు."

"లేదు మణీ ! నాకేం కష్టంలేదు. నిస్సంకోచంగా నీ అనుభవాలని నాతో చెప్పు." ప్రార్థనగా అన్నాడు.

గదిలో వెలుగుతూన్న.. 60 వాట్స్ బల్బ్‌వంక శూన్యంగా చూస్తూ మొదలెట్టింది నాగమణి.

"అమ్మా, నాన్న, నా చిన్నప్పుడే పోయారు. అంత పెద్ద మేడలోనేనూ, అన్నయ్యా, వంటమనిషీ, ఉండేవాళ్లం. అన్నయ్యకి నేనంటే చాలా అపేక్ష. వంట మనిషి, పేరుకి వంటమనిషే కాని, ఇంట్లో బంధువులానే మమ్మల్ని ఆదరించేది. అంత పెద్ద ఇంట్లో మేము వంటిగా ఉండలేక, మా దూరపు బంధువుల్ని వచ్చి మాతోపాటు ఉండమన్నాం. ఆయనపేరు రాజమాణిక్యంగారు. వరసకి మామయ్య అవుతారు. ఏదో ఆఫీసులో క్లర్కుగా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కూతురు కనకాంగి. ఆయనకి భార్య పోయింది. వేలువిడిచిన చెల్లెలు సన్నమ్మ వంటావార్పూ చూసేది. కనకాంగి నాకంటే వయస్సులో పెద్దదైనా నా ఆటపాటలకి చేదోడు వాదోడుగానే ఉండేది.

"కనకాంగి అంటే, మీ వదినేకదూ !" అన్నాడు పద్మనాభం.

"అవును. వదినే ! చెప్తున్నాను వినండి. కనకాంగికి తల్లిలేదు. ఒకవేళ ఉన్నా, మా కులంకాదు. రాజమాణిక్యంగారు చిన్నప్పుడు ఇంట్లోంచి వెళ్లిపోయాడుట : నంజన్ గూడులో వేలుమణి మొదలియారు కూతుర్ని లేవదీసుకుపోయి శ్రీరంగపట్టణంలో పెళ్లి చేసుకున్నాడుట. కనకాంగి తల్లి తంగమణి యాసగా మాట్లాడేదిట. భార్య చనిపోయాక స్వంత వూరు వెందోడువచ్చి కాపురం ఉండేవాడుట. ఆయనతో మాకుగల బంధుత్వం సన్నమద్వారానే తెలిసింది. రాజమాణిక్యం దృఢంగా ఉండేవాడు. మా ఇంటి ఆవరణంతా రకరకాల పూల మొక్కలతో నింపేడు. మామయ్యంటే నాకు చాలా అపేక్ష. కనకాంగి కూడా నేనంటే చాలా అభిమానం ప్రదర్శించేది. ఎక్కడి

కెళ్ళినా ఇద్దరమూ కలిసి వెళ్లేవాళ్లం. కనకాంగి చాలా బాగుంటుంది. పెద్దదైన కొద్దీ, ఆమెలో ఆకర్షణ మరీ ఎక్కువైంది. కోలముఖం, అందులో ఇమడని పెద్ద కళ్ళూ, ఎత్తుగా నించున్న ముక్కూ, కాస్త వెడల్పైన పెదాలూ, నవ్వితే నాగుపాము నాట్యంచేసినట్లు కదిలే కనురెప్పలూ, క్రింది పెదవి క్రిందుగా గడ్డంమీదకు శనగబద్దంత పచ్చబొట్టూ, ఎదుటి మనసుని అట్టే నిలబెట్టి, తమచుట్టూ, ప్రదక్షిణం చేయించుకునేవి. అన్నయ్య ఆ సంవత్సరం, యం. యస్. సి. ప్యాసయ్యాడు. నేను, యం. ఏ.కి కట్టాను. కనకాంగి బి. ఎ. దాటలేక పోతోంది. సన్నమ్మ కనకాంగికి పెళ్లి ప్రయత్నాలు చేయమని మామయ్యతో రోజూ, పోరుతుండేది. మామయ్యకి, తనతోటపనేమిటో అంతే ! వేళకింత సాపాటు చేయటం వెళ్లి తోటలోని పూలమొక్కలతో కాలక్షేపం చేయటం.

"అరే మణీ ఒక్కొక్కరోజు ! ఈగులాబీ లేత రంగులోకి దిగిపోయిందే ఎర్రని గులాబీయె !" అనేవాడు.

ఇంకో రోజు.

"అరే ! ఈ చామంతి గుడ్డి పువ్వులు విడుస్తోందే మణీ ! మొగ్గల్ని త్రుంపటం మర్చి పోయాను." అని ఆందోళన చెందేవాడు.

సన్నమ్మ ఊరికే విసుక్కునేది. మాతో మాట్లాడేటప్పుడుకూడా ఈ ఏడు పారిజాతాలు తక్కువ పూశాయనో, చన్నంగి కొబ్బరి గెలవేసిందనో, కొత్తపల్లి మామిడి పూత, నిలవలేదనో తప్పితే, మరే విషయాలూ ఆయన సంభాషణలో దొర్లేవికావు. మావంటి మనిషి సీతమ్మ సన్నమ్మ కూడా, కనకాంగి పెళ్ళిగురించి బెంగ పెట్టుకున్నారు. క్రమక్రమంగా, వాళ్ల దృష్టి మా అన్నయ్యమీద పడిందనుకుంటాను. ఒక రోజు ప్రస్తావనగా, అన్నయ్య ముందు ఈ విషయం పెట్టారు. అన్నయ్యకి కూడా, కనకాంగి అంటే ముందు నించీ ఇష్టమేమో మరి ! వెంటనే అంగీకరించాడు. వైభవంగా బంధువులంతా ముందుకువచ్చి, వాళ్ల వివాహం జరిపించారు. నాకు అప్పటిదాకా, కనకాంగికి పెళ్లయితే అత్తవారింటికి పోతుందేమో, నే నొంటిగా ఉండిపోవాల్సి వస్తుందేమో అన్న దిగులు వేసేది. ఆమె, మా ఇంటి మహాలక్ష్మిగా స్థిరపడటంతో నాకెంతో ఆనందం కలిగింది. కనకాంగి చాలా అందమైనది. నాకింక, ఏం చీరలు చూసినా, ఏ నగలు చూసినా, ఏ పూవులు చూసినా, మా వదినవంటిమీద అలంకరించనిదే నిద్రపట్టేదికాదు. కనకాంగి మీద నాకు ఒకవిధమైన ఆరాధభావం కలిగింది. నా అభిమానమూ, ఆరాధనా, కనకాంగి లోకువగా తీసుకుంది. తను కులంలేనిపిల్ల ! భగవంతుడిచ్చిన సౌందర్య మాధారంగా ఉన్నత వంశీయుల ఇంటికోడలైంది. నేను తనపట్ల చూపే అనురాగాన్ని ఆమె, మా అన్న ఇవ్వవలసిన ఆస్తికోసం నేను చూపే మెరమెచ్చులని భ్రమించింది. కొత్తలో మా అన్నయ్య అట్టే పస్తాయించేవాడు కాదు. కాని రానురానూ, ఇంట్లో నేనే పనిచేసినా విపరీతార్థాలు తీసి మాట్లాడేవాడు. పెళ్లయ్యేదాకా, నేను, కేంద్రంగా ఉన్న దాన్నల్లా పెళ్లయిన తర్వాత, మారిపోయాను కాబోల్ను' ధనం ఉంటే సుఖం ఉంటుందనుకుంటారు చాలామంది. కాని ధనంకన్న ఆప్యాయత వల్లే ప్రాణికోటి సుఖపడుతుందనే సంగతి ఎందుకు విస్మృతమవుతున్నదో నాకు తెలియదు. స్నేహంగా నా చుట్టూ తిరిగే కనకాంగి వదిన నాపట్ల కాస్తయినా కనికరం చూపెట్ట లేకపోయింది. రాజమాణిక్యం తోటమాలిగా ఎంతో తృప్తితో ఉన్నవాడల్లా అన్నయ్య మామగారిగా పరివర్తనం చెందేటప్పటికి ఎక్కడలేని హోషూ వచ్చి పడ్డాయి. క్లబ్బు కెళ్లటం, పేకాడటం మొదలెట్టాడు. అన్నయ్య ఆయన ధాటికి తట్టుకోలేక ఇంట్లో ఉన్న మా అమ్మనగలు అమ్మటం మొదలెట్టాడు. వంట మనిషి సీతమ్మ వూరుకోలేదు.

"అబ్బాయ్ ! తల్లిసొత్తు నీవు అమ్మటం మంచిపని కాదు. అది కూతురుకు చెందుతుంది. మణి కియ్యాలిస్సిన నగలు నీవు అమ్ముకోవటం తప్పుకాదా ? న్యాయంగా ఆమె సగం ఆమె కిచ్చేసి మిగిలినది నువ్వేమయిన చేసుకో !" అన్నది.

అన్నయ్యకి కోపం వచ్చింది.

"నీకు తెలవదు, సీతం పిన్నీ ! ఇదంతా మా నాన్న స్వార్జితం. దానికేం హక్కులేదు. మా నాన్న జబ్బులోనేను ఆయనకు బోలెడంత సేవచేశాను." అన్నాడు.

"పిత్రార్జితమైనా, ఈ రోజుల్లో ఆడపిల్లలకి వాటాలున్నయ్ కదూ ! ఏమైనాసరే ! నువ్వు సగం నాగమణి పేర, రిజిస్టర్ చేయిస్తేకాని ఇంట్లో ఆస్తి ఖర్చు పెట్టటానికి కుదరదు" సీతం పిన్ని పట్టుపట్టింది. కనకాంగికి కోపం వచ్చింది.

"ఆయన ధనం ఆయనిష్టం వచ్చినట్లు చేసుకుంటారు. నీకెందుకు ? కుటుంబ వ్యవహారాలు మాట్లాడటానికి నీకేం అధికారం ఉంది ?" అని నిలదీసింది. సీతం పిన్ని మనసు గాయపడింది. మీ ఇంట్లో అయ్యర్‌లాగే, మా ఇంట్లో, సీతం పిన్ని చిన్నప్పట్నించీ ఉండేది. అమ్మ ప్రతీపనీ, ఆమెని సలహా చేయందే చేసేదికాదు. నానించి పిన్ని మాటలు పడటం నాకు కష్టమేసింది.

"వదినా హద్దులు మీరుతున్నారు ! ఆమె అన్యాయం జరుగుతూంటే చూసి వూరుకోలేక ఏదో అన్నారు. నువ్వలా ఆమెని తీసిపారెయ్యటం బాగాలేదు !" కోపంగానే అన్నాను.

"దానిమీద విరుచుకు పడతావెందుకు ? కూటికున్న మనిషి కులమంతా చెరపబూనటం ఏం బాగుందేం ?" అన్నాడు అన్నయ్య. సీతంపిన్ని కళ్లు నిండుకున్నాయి. ముప్పయి ఏళ్ల పనితనంలో ఆమె ఏనాడూ మాట అనిపించుకునేట్లు చేయలేదు.

"అవునన్నయ్యా ! కూలికి వచ్చి, ఆలై వెలసి, పాలిమ్మని కూర్చున్నది. సీతంపిన్నే ! నువ్వు ఇల్లా అనగలుగుతా

వనుకోలేదు. నా భవిష్యత్తుకోసం, సీతంపిన్నిగారు కంగారు పడిందన్న మాటేకాని, లేకపోతే ఆమెకేం కావాలి ?"

అన్నయ్య ఎర్రబడ్డాడు.

"వెధవ నూటిపోటి మాటలు మానెయ్యి. నా తండ్రి ఆస్తి నా ఇష్టం. మీరెవ్వరు అడ్డగించటానికి ? ఇష్టం ఉంటే ఉండి గుప్పెడు బియ్యం' నములండి. లేకపోతే పోండి ! ఇంట్లో ఉండి, నా మనస్సు మంటు పెట్టకండి !"

గట్టిగా కేకలేశాడు అన్నయ్య ! కాలేజీనించి రాగానే "గాన్లే"నుకునే నన్ను ఎగరేసి హృదయానికి హత్తుకుని ముద్దాడే అన్నయ్య ! సైకిలెక్కించుకుని, సముద్రపు ఒడ్డున అర్థరాత్రిదాకా త్రిప్పే అన్నయ్య ! నాకు జ్వర మొస్తే నిద్రాహారాలు మాని, నా మంచంమీద కూర్చుని కాపలాకాసే అన్నయ్య ! ఏకోదరులని విడదీయగల మంత్ర శక్తి ప్రేయసి వెడదకన్నుల్లో ఉంటుంది కాబోల్ను ! వఃర్నాడు సీతంపిన్ని మూటాముల్లె సర్దుకుంది. ముప్పయ్ ఏళ్లుగా, నల్లి దూరకుండా, కంట్లో కనుపాపల్లే కాచుకు కూర్చున్న ఇంటినీ, నా వంటినీ, అన్నయ్యకి అప్పచెప్పి, తనకు నచ్చిన ఊరు వెళ్లిపోవటానికి సిద్ధమైంది.

"నాకోసమైన ఉండవా ? సీతం పిన్నీ !" అన్నాను.

"స్థానం లేదని తెలిసాక ఉండకూడదమ్మా ! మీ ఇంట్లో మంచే అనుభవించానో, చెడే అనుభవించానో, అయిపోయింది. భగవంతుని కృపవల్ల నీవు చల్లగా ఒకింటి కోడలై పేరు తెచ్చుకోవాలి. అదే నా వాంఛ. తల్లీ !" చీర కొనుక్కోమని యాభయ్ రూపాయలు ఇచ్చేను. మళ్లీ నా చేతికిస్తూ "ఇవే, నేను నీ కివ్వకలిగే పెళ్లికానుక ! నువ్వే మంచి బట్టలు కొనుక్కో', అన్నది. నాకా ఇల్లంతా శూన్యంగా కన్పించింది. నేను వంటరినై పోయాను. నా బాగు ఎవరు చూస్తారు ? ఎవరున్నారు ? రానురానూ, వదిన నాతో మాట్లాడటం మానేసింది. అస్తమానమూ, సన న్మ తనూ ఏవో గుసగుసలాడుకునేవారు. అన్నయ్య, పల్లెటూళ్లో ఉన్న భూములన్నీ అమ్మేశాడు. వచ్చిన డబ్బంతా కనకాంగిపేర బ్యాంకులో వేశాడు. ఆ సంవత్స రమే నేను యం. ఎ. పరీక్షకి నాగపూరుకి వెళ్లాల్సి వచ్చింది. మెడలో ఉండే నెక్లెస్ తెగిపోయింది. "అతికించవా అన్నయ్యా !" అని అడిగాను.

"ఈ ఏడాది, నీ క్రింద ఎంతైనదో తెలుసా ? ఇంకా నెక్లెసులూ అవీ తెమ్మంటే ఎక్కణించీ తేను ? మొన్ననే వంద రూపాయలు పెట్టి బట్టలు కొనుక్కున్నావు. రెం డొందలైనా లేందే పరీక్షకి వెళ్లి రావటం కుదరదు ! తెలుసా!" అన్నాడు. అప్పటించీ నాకు, నగలు ధరించటం మీద మోజు తీరిపోయింది. నన్ను మెచ్చుకునే వాళ్లెవరున్నారు ? అనే విర్లిప్తత నాలో కలిగింది.

"తిని కూర్చోలేక చదువులు నీకు ! డబ్బు ఇక్కడ పోగువేసుకుని కూర్చున్నామా ? ఏదో దొరికిన ఉద్యోగం చేసుకోకూడదూ ?" అనేది కనకాంగి. నాకు మనశ్శాంతి దూరమైంది. ఈ ఇంట్లోంచి నాకు విముక్తి ఎప్పుడా అనే వ్యథ గుండెల్ని, పిండేది. ఉన్నట్లుండి, ఒకరోజు నీలగిరికి బయలుదేరింది. తండ్రిని తీసుకుని, అన్నయ్యకి సెలవు ల్లేవు. నేను వూరుకోలేక—

"నీ ఇంటిని నువ్వు శ్రద్ధగా చూసుకోకపోతే, ఎల్లా, గమ్మా ! అన్నయ్యకేమో సెలవుల్లేవుకదా ! ఇప్పుడు వెళ్లక పోతే ఏం ?" అన్నాను. ఆమె ఆ ఇంటికి ఇల్లాలు. గృహలక్ష్మి ! ఆమె ఇంట్లో మసలకపోతే నాకేమీ తోచేదికాదు. నాతో ఆమె సరదాగా ఉండకపోయినా ఫరవాలేదు. అన్నయ్యతో సరదాగా ఉంటోంది కదా ? అది చాలదా నాకు ? ఎప్పటికైనా సంసా రం నడుపుకోవల్సినది వాళ్లేకదా ! నన్ను ఏమి తిట్టినా సరే ! వాళిద్దరూ ఇంట్లో తిరుగుతూంటే, నాకు, అమ్మ నాన్న తిరుగుతున్నట్లే అనిపించేది. అంచేత నాకు అంత ప్రేమ !' నాగమణి కళ్లు ఆగలేదు. ఆమె కృశించిన చంపల మీద కన్నీరు వర్షిస్తోంది.

"ఊరుకో మణీ !" చటుక్కున ఆమె తలను తన హృదయానికి హత్తుకున్నాడు పద్మనాభం. అతని హృదయా వేగం, నాగమణి చెవులకి స్పష్టంగా వినపడ్తోంది. కాస్సే పయ్యాక నాగమణి తేరుకుంది.

"నా ప్రేమని వాళ్లు గుర్తించలేదండీ ! అదే బాధ నాకు ! నేను వాళ్లనించి ఏం కోరుకున్నాను ? నాకేం లభ్య మయ్యింది ? నాక్కావల్సిందిదేముంటుంది ! చెప్పండి !

"సరే ! ఏమందో తెలుశా మా వదిన ! ఇది నా ఇల్లు ఎల్లా అవుతుంది ? నువ్వుండగా ! నా ఇల్లైనప్పుడు నేను ఆ మాత్రం శ్రద్ధ తీసుకోకపోను." అన్నది విసురుగా. నేనుండగా, అది తన ఇల్లవుతుందని నమ్మకం ఉండదు అన్న మాట. ఎంత బాధాకరమయిన విషయం ? ఏ ఆడబిడ్డయినా, అనగలదా ? ఆ మాట ! తను మాత్రం స్త్రీకాదా ? తను ఒకింటి ఆడబిడ్డకాదా ? కాని అయితే ఒకటి మటుకు నిజం. ఆమెకి ఇల్లులేదు వాకిలిలేదు. ఆదరించాల్సిన అన్నదమ్ములు లేరు ఆమెకి. మామూలు ప్రేయసీ ప్రియ బాంధవ్యం తప్ప, కుటుంబపు మమకారాలు అర్థంకావు. అందుకనే మా అన్నయ్య, అంత చప్పున మారిపోగలిగాడు. ఒకసారి అన్నయ్యతో అన్నాను.

"అన్నాయ్ ! వదినకి శ్రద్ధ తక్కువరా ! ఇంటి పట్టు ఉండదు. ఖరీదైన సామాన్లు ఎక్కడ పడితే అక్కడ పడ వేసి పోతోంది. అన్నప్పుడూ మన రోజవుతుందా ? పని వాళ్లు మనవాళ్లవుతారా ?"

"దాన్ని గురించి రిమార్కు చేయుటానికి నువ్వెవరు ? నా సంసారం జోలినీకెందుకు ? నీ ఏడుపు నువ్వు ఏడు!" చీద రింపుగా అన్నాడు. ఇంక తనతోనూ మాట్లాడటం తగ్గించాను. ఒక్కర్తినీ, రెండేళ్లు ఎల్లా కాలం గడిపానో, నాకే అర్థంకాదు. మీ సంబంధం సీతం పిన్నే తీసుకవచ్చింది. కట్నం ఇవ్వలేనవి, "గంగిరెద్దులా గంతులేసాడు." ఇచ్చితీరాలని సీతం పిన్ని.

"మాటిమాటికి మీరెందుకు కిక్కడికి రావటం ? మా ఇంట్లో సుఖశాంతులుండనివ్వరా ఏమిటి ?"

అని వదిన విసుక్కోవటం. మొదలెట్టింది.

"నీ కెందుకు పిన్నీ ! నా గురించి నీవిన్ని మాటలు పడటం !" అన్నాను.

"చేతుల్తో పెంచినది, మొగ్గలోనే త్రుంపేయుటా నికా తల్లీ! నేనెన్ని మాటలు పడ్డా నీ మెళ్లో ఆ మూడు ముళ్ళూ పడితే, ఆ మాటలు, పన్నీరు వర్షంలో కడిగేసుకున్నట్లే !" అన్నది. కన్న ప్రేమకన్న పెంచిన ప్రేమ గొప్పది అంటారు ఇందుకనే కాబోల్ను. నా కన్నతండ్రి ఏం చేయగల్గారు ? పన్నెండేళ్లు నిండుతూన్న ఆడపిల్లని దయా, ప్రేమాలేని అన్నయ్యకి, స్వార్థ పూరితుడైన అన్నయ్యకి, అప్పచెప్పి పోయారు. నాకని ఏదో కొంచెం ఇవ్వకపోబట్టి వదిన దగ్గర అంత అలుసై పోయాను. ఆ రోజుల్లో అప్పుడు, అన్నయ్య, నాపట్ల కనపరిచే ప్రేమనిచూసి మా నాన్న మోసపోయారు. అందుకని నన్ను నిర్ధనురాలిగా వదిలి వెళ్లిపోయారు. అత్తయ్యగారు, నన్ను దయతలచి కట్నం కానుకలు అఖర్లేదనుకున్నారు కనుక సరిపోయింది. లేకపోతే నేనే మయిపోదును ? పుట్టుకతోనే తల్లినీ, యౌవనారంభంలో తండ్రినీ, తర్వాత భాతృ ప్రేమనీ పోగొట్టుకున్న నిర్భాగ్యురాలిని. నన్నెవరాదరిస్తారు ?

మీ ఇంటికి వచ్చాక, అత్తయ్యగారిదగ్గర, భద్ర దగ్గరానేను చాలా సేద తీరాను. అల్లాంటి బంధువులు నన్ను ప్రేమించటం నాకెంతో ఉత్సాహానిచ్చింది. జీవించవచ్చుననే ఆశ చిగురించింది. అంచేత మీరు మాట్లాడకపోయినా, వాళ్ల అండని నిర్భయంగా, స్వేచ్ఛగా, బ్రతకగల్గాను. ఈ రెండేళ్లల్లో, మా అన్నయ్య వదినా వచ్చి చూడటం కాని, ఉత్తరాలు వ్రాయటంకాని చేయలేదు. పుట్టింటి ప్రేమనోచుకోలేదు నేను. వాళ్లకి నా పట్ల ఇంత నిరాదరణ ఎందుకనో నాకు తెలియదు. సాధారణంగా, పుట్టింట గౌరవించని, స్త్రీని అత్తవారూ భర్త కూడా ప్రేమించలేరు. అందుకనే వాళ్ల ప్రసక్తి, అత్తయ్యగారి దగ్గరా, భద్ర దగ్గరా తేను, నేను. నా కెవరితోనూ మాట్లాడటం ఆట్టే అలవాటులేదు. అంచేత కొంచెం ముభావంగా ఉండటంతో భద్రకి కోపం అనుకుంటాను.

అయినా నేను ఆమెని ఎంతో గౌరవిస్తాను. నేను మా వదినవల్ల పొందలేని ప్రేమని, భద్రకి అలభ్యం చేయగలనా ?" నాగమణి ఆవేశ గా అన్నది. పద్మనాభం తృప్తిగా భార్య వేపు చూశాడు. ఆమె కళ్లు చుట్టూ పరుచుకుంటున్న విషాదనీడ తను పోగొట్టలేనిది కాదు.

"అంచేతే నావల్ల జరిగిన ఈ అకార్యం, వారికి చెప్పలేక పోయాను అన్నది. మళ్లీ నాగమణి.

పద్మనాభం తలెత్తి ఆమెకేసి చూశాడు. "ఏమిటి" అన్న ప్రశ్న అతని ముఖ భంగిమలో ఉత్పన్న మయింది.

"చెప్పకుండా ఉండలేను. మీ నుంచి ఏమీ దాచను." ఆమె చెంపలు అదురు తున్నాయి. అబద్ధం ఆటటానికి కూడా అచేతన మవుతున్నది ఆమె సున్నిత మనస్సు !

"మీకు, రఘునందన్ తెలుసనుకుంటాను. ఈ ఊళ్లో కాలేజీలో వర్కుచేస్తున్నారు."

తలవంచుకుంది నాగమణి.

"అయితే !"

ఆ అయితే, అన్న ప్రశ్న వెనకాతల ఎన్ని సంశయా పూరిత వ్యథాజ్వాలలు ఎగసిపడుతున్నాయో, నాగమణి పసికట్ట కలిగింది.

"ప్రతి జీవితం, రకరకాల అనుభూతుల కోసం అఱ్ఱులు చాస్తుంది. ఈ సుఖదుఃఖాలనేవి, మానవ మనో కల్పితాలని కొంతమంది వ్యక్తుల వాదన. ఏదయినా, శరీరానికే గాని, మనస్సుని స్పృశించలేవు. మానవుల రసచేతన ఒకోక్కప్పుడు, ఊర్ధ్వ దృష్టిలోనే కాని, ఆ దృష్టిని ప్రసరింపజాలదు. వాళ్ళు తాత్కాలిక ఇంద్రియ సౌఖ్యాలని అతీంద్రియానందానుభూతిగా, వర్ణిస్తూంటే, మనం కూడా, ఆ మధ్యలో పరిభ్రమిస్తూ, ఏది శాశ్వతం ? అనుభవమే జీవికి ఆనందం అనుకుంటాం—

ఈ శరీరం మట్టిలో కలిసిపోయేదే ! నీతీ నియమం ఎల్లాంటి వారికి ? వడ్డించిన విస్తరిలాంటి జీవితం కల వారికి. మేడలో కూర్చున్నవాడు అడుక్కు తింటున్న వాణ్ని, పనిచేసుకు బ్రతుకలేవా ? అని గద్దిస్తాడు. ఆ పని దొరక్కే అడుక్కు తింటున్నానంటాడు అడుక్కు తినేవాడు. పని ఇచ్చే శ్రద్ధ అనే వాడికి, పనిచేసే ఓపిక వినేవాడికీ ఉండదు. కాని ఆ తర్కం తాత్కాలికమయినది. నైతిక ప్రవర్తనలూ, విలువలైనా అంతే ! "నీతిగా ఉండండి" అని చెప్పేవాడూ, వినేవాడూ కూడా, అవినీతి పనులంటే అంతర్గతంగా ఆనంద పడుతారు. మనం చేయలేని పనులన్నీ, అవినీతి అని అనటం వ్యక్తుల సరదా ! కాస్త పొదుపుగా జీవిస్తున్నవాణ్ణి, దూబరావాడు, లోభి అని హేళన చేస్తాడు. స్త్రీలతో ఆనందం అనుభవించలేని దుర్బలుడు, స్త్రీ పాపహేతువనీ, సంసారం దుఃఖ సాగరమనీ నిర్వచిస్తాడు. నిరంతర స్త్రీ సాహచర్యం ఉంటే కాని భరించలేని యౌవనుడు, "సర్వం మిథ్య! సానిసత్యం !" అని ప్రవచిస్తాడు. ఎవరి వాదాన్ని మనం ప్రామాణికంగా తీసుకొని జీవితం నడప బూనినా సాహస కృత్యమే అవుతుంది. ఎవరి శారీరక, మానసిక ఆనందానికి వాళ్ళు ప్రయత్నించి జీవితాన్ని సఫలం చేసుకోవాలి !" ఇది రఘునంద్ చదువుకునే రోజుల్లో చెప్పే ఉపన్యాసం. నాకు అతనితో మామూలు పరిచయమే ఉండేది. మన వివాహం అయినాక, నాకు జిజ్ఞాస పట్టుకున్నది ఈ సంవత్సరములోనే. నేనెందుకు జీవిస్తున్నాను ? నేను జీవించటంవల్ల, ఎవరికి ఆనందం లభ్య మవుతున్నది. నాకన్న చెట్టు నయం—దారినిపోయే బాటసారులకి నీడనిస్తుంది. పుట్ట నయం ! ఎంతో పొగసైన తెల్ల త్రాచ

అవి ప్రాణప్రదంగా తన గర్భంలో దాస్తుంది. గట్టు వశయం! నురగలతో పరవళ్లు త్రొక్కి సమస్త ప్రాణికోటినీ, తన కెరటూలలో, అమిత లాలసత్వంతో విలీనం చేసుకునే కడలిని అడ్డగలిగి, సమస్త చైతన్య ప్రకృతినీ పరీక్షించకలుగుతుంది." ఈ భావ సంఘర్షణలో నాకు, కంటికి నిద్రవచ్చేదికాదు. ఈ నిర్వేదంలోనే, రఘునందన్, మళ్లీ, ఈ ఊరికి రావటం సంభవించింది. ఇనాళ్లకి నా జీవితాన్ని విప్పిచెప్పుకుందుకు ఒక స్నేహితుడు దొరికాడన్న ఆనందంతో శరీరాన్ని విస్మరించాను. కాని ఒకస్త్రీ తన దుఃఖగాథ స్త్రీతో చెప్పుకుంటే, సానుభూతి లభిస్తుందన్న సత్యం, నాకు తెలియదు. అతను పురుషుడు! నాది అనుభవంలేని, నిస్సార జీవితం! ఇంకేం కావాలి!" నాగమణి తలవంచుకునే చెప్పుతోంది. పద్మనాభ మనస్సు చివుక్కుమంది. ఈ స్త్రీలని తను కనిపెట్టలేదు! వీళ్లకి ఎప్పుడేం కావాలో, తనకి తెలీదు! తను వాళ్ల మనస్సుని కనిపెట్టి నడుచుకోలేడు. తన జాతకంలో స్త్రీ చేత వంచితుండవ్వాలని వ్రాసిపెట్టి ఉంది. కాబోలు అయినా, నాగమణి తప్పేమిలేదే! తను ఆమె వంక, కన్నెత్తి చూడలేదు. నిరంతరం ఆమెకోసం తిరుగుతూన్నా, సంధ్య, అల్లా ప్రవర్తించింది కదా! సంధ్యకన్న, నాగమణి వేలరెట్లు నయం!

"నిన్ను మనస్పూర్తిగా అంగీకరిస్తున్నాను మణీ! నా అనుచిత ప్రవర్తనకీ, నీ నిర్వేదంలోని అనౌచిత్యానికీ సరిపోయింది. బాధపడకు!" దగ్గరకు తీసుకుని లాలించబోయేడు. నాగమణి శరీరం అగ్ని జ్వాలల్లో ధగ్దమైపోతోంది. తను ఆశించినది ఒకటి! జరుగుతూన్న దొకటి భగవాన్! ఏమిటీ విపరీతం? తను ఈ ఆత్మవంచన నించి ఎప్పటికి విముక్త అవుతుంది!"

"మీ సహృదయానికి నేను లొంగిపోతున్నాను. అయిదారు నెలలు మీరు నన్ను సహిస్తే...." చేతుల్తో ముఖం కప్పుకుంటూనే ఏడిచేసింది. నాగమణి. పద్మనాభం మౌనంగా ఆలోచిస్తున్నాడు. వీళ్లంతా స్త్రీలు! లలిత, సంధ్య, మణి, వీళ్లంతా స్త్రీలు! నిజంగా స్త్రీలేనా? తన్ని వచించటానికి సృష్టింపబడ్డ నాగుపాములా? వీళ్ల శరీరాల్ని ఇంత పూరేకుల్లా, మృదువుగా తయారుచేసి, వీళ్లల్ని గుండెల్ని, నల్లరాతితో ఎందుకని సృష్టించేడు! శరీరం ఆకర్షకం! మనస్సు అగాధం! ఆ అగాధాలోకి చూసీ తన కళ్లు నెప్పి పుట్టాయి. లాభంలేదు. తనకళ్లు మూసుకుపోవాలి తప్పదు. కటిక చీకటైనగతంలోంచి, ఒక్కసారి కోటి సూర్యకిరణాల భవిష్యత్తులోకి చూస్తే, గడ్డకట్టిన మంచుగడ్డని, కాలే ఇనుప మూకుడులో గిరాటేస్తే ఏమవుతుందో, అదే అయ్యింది, తన పరిస్థితి. నాగమణి ఎక్కిళ్లు వింటూనే నిరాసక్తతతో సోఫాలో ఒరిగి కన్ను మూశాడు పద్మనాభం. రెండు వర్షఋతువులూ, వర్షించకుండానే, వెళ్లిపోయాయి. ఇంట్లో భద్రకాని, శారదమ్మకానీ గమనించలేదు.

ఆఫీసర్స్ క్లబ్బులో "కొత్త మెంబర్ రఘునందన్" ఆ రోజు పార్టీ ఇస్తున్నాడు. రఘునందన్‌ని చూస్తూనే, పద్మనాభానికి ఏదో జ్ఞప్తికొచ్చింది. పార్టీ అయ్యాక రఘునందన్ ఉన్న టేబుల్ దగ్గరకెళ్లి—

"మీరేనా, కొత్తగా కాలేజీలో ఎప్పాయింట్ అయినదీ!" అన్నాడు.

"అవును! మీరు?" అన్నాడు రఘునందన్.

"నేను ఫలానా కంపెనీలో పని చేస్తున్నాను. మీరు వచ్చి ఎన్ని రోజులయ్యిందీ!" అన్నాడు. పద్మనాభం.

"రెండు సంవత్సరా లయ్యింటుంది."

"మీరు అనంతపురంలో చదివారు కదూ!" అన్నాడు.

"అవును. మీకెలా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగాడు. రఘునందన్.

"జి. యన్. మణి తెలియదూ!"

"మణి! మణి! ఓ! నాకు తెలియకపోవట మేం? మా క్లాసుమేటు! ఆమె, మీ...?"

"నా భార్య!" అతనిలోకి పస్తాయించి చూశాడు, పద్మనాభం.

"అయితే తను ఇక్కడ ఉన్నదన్నమాట. చూసి చాలా కాలమయింది. నేను కాశీలో ఉండగా కాబోలు. మీ మేరేజ్ ఇన్విటేషన్ వచ్చింది. మీరుంటున్నది ఎక్కడ! చూడాలని ఉన్నది. చాలా రోజులయింది." అన్నాడు.

"మీరు తనకి తెలుసని చెప్పింది మణి. అందుకనే" అన్నాడు. అంతకన్నా ఏం మాట్లాడాలో తెలియులేదు పద్మనాభానికి.

"అవును తెలుసు. నా కంటే కూడా, ఆమె గురించే ఎక్కువ తలపోసేవాణ్ణి. ఆమె జీవితం ఎల్లా గడుస్తుందా, అన్న దిగులుతో, ఒక్కొక్కప్పుడు, నాకు చదువుకో బుద్ధయ్యేదికాదు." "అంత ఇదన్నమాట. ఆమె అంటే!" అద్భుతపడ్డాడు పద్మనాభం. అంత ప్రేమించి పూజించేవ్యక్తి అండ ఉండగా తన నెందుకు పెళ్లాడినట్లు?

రఘునందన్ పూర్వ స్మృతులలోకి విసరివేయబడ్డాడు.

"అల్లారండి. ఇక్కడ రొదగా ఉన్నది." అన్నాడు. క్లబ్బులో ఫ్లడ్ లైట్లు వెలిగాయి. టెన్నిస్ ఆడేవాళ్లు టెన్నిస్, మిగిలినవాళ్లు, పేకాట టేబుల్స్ దగ్గర సర్దుకున్నారు. వాళ్లిద్దరూ సర మామిడిచెట్టు క్రింద కూర్చున్నారు. అప్పుడే పార్టీలో ఫలహారాలు చేసిరావటం మూలంగా, పద్మనాభం కళ్లు, చెట్లయొక్క చల్లని గాలికి బరువుగా వాలుతున్నయ్.

"మణి మీలాంటివారి ఇంట పడగలిగినందుకు నేనెంతైనా సంతోషిస్తున్నాను. నేను మణివాళ్ల ప్రక్క ఇంట్లో అద్దెకుండేవాణ్ణి. ఫారాలనించీ, నేనూ మణీ చదువుకునేవాళ్లం. కాలేజీలో జేరిన సంవత్సరం అనుకుంటాను. మణి

వాళ్లన్నయ్యకి వివాహం అయింది. అప్పట్నించీ, మణిలో చలాకీతనం కన్పించలేదు. నేను రెండుమూడుసార్లు పల్కరించినా ఏదో అన్యమనస్కంగా జవాబులు చెప్పేది. అల్లా తనలో తను కృంగిపోవటంకన్న మానసికానందం కోసం మార్గం అన్వేషించటం ఆరోగ్య ప్రదమని ఎన్నిసార్లో హెచ్చరించాను. విన్పించుకునేది కాదు. ఫోర్తు ఇయర్‌లో అనుకుంటా ఇంగ్లీష్ క్లాసు జరుగుతూండగా, కళ్లు తిరిగి పడిపోయింది. నేనూ, సుశీల అనే అమ్మాయీ ఇంటికి తీసుక వచ్చాం. చాలా నీరసంగా ఉందన్నాడు డాక్టర్. తర్వాత క్రమ క్రమంగా కోలుకున్నా అప్పుడప్పుడు, ఫిట్స్‌గా వచ్చేవి. దానికి మానసిక అశాంతతే కారణం అన్నాడు డాక్టరు. ఫోర్తు ఇయర్ ఎగ్జామ్స్ అయిపోగానే, తనకి మళ్లీ జ్వరం రావటం మొదలెట్టింది. వాళ్ల ఇంటి విషయాలు మీతో నేను చెప్పకూడదు. కాని మీ ముఖంలో ఒక విధమైన ప్రశాంతత అలముకొని ఉన్నది. కనుక మణికోసం మీరేమైనా చేయగల సంసిద్ధత కనుపడ్తోంది.'' నుదుటిమీద పట్టిన చెమట బిందువులని చేరుమాలుతో తుడుచుకున్నాడు రఘునందన్. కర్తవ్యతా విమూఢునిలా వింటున్నాడు పద్మనాభం. నిశాకన్నె తన హొయలు వలకబోస్తూ, చెట్ల గుబుర్లలో నృత్యం చేస్తున్నది.

''మణికి, జ్వరం వస్తూనే ఉండేది. అంత పెద్ద ఇంటిలో, ఒక మూల తనగదిలో నిర్జీవంగా పడి ఉండేది మణి. ఇంట్లో ఏం కావాలని, అడిగేవాళ్లుండేవాళ్లు కాదు. కనకాంగి మేనత్త. సన్నమ్మగారని ఒకావిడ ఉండేది. ఆవిడ వంట ఇంటి పెత్తనం వహించేది. కనకాంగి ఇంక ఇరవయి నాలుగ్గంటలూ, షాపింగనీ, పిక్చర్లనీ తిరుగుతూ ఉండేది. రోగికి, మందులూ, మాకుకన్న, ఆదరణా, ఆప్యాయతే ఎక్కువ ఫలితాన్నిస్తాయి. నేను వెళ్లి ప్రక్కన కూర్చునేసరికల్లా మణి కళ్లు ఆనందాన్ని వర్షించేవి. సన్నమ్మగారికి నారాక రుచించేది కాదు. అనుకుంటాను. ఎప్పుడు వెళ్లి ముఖం చిట్లించేది. ఆవిడ. మణి అన్నయ్య మటుకు బంధువులైనా, స్నేహితులైనా, వచ్చేటప్పుడు మణిమీద ఎక్కడలేని ఆపేక్ష ఒలకబోసేవాడు. కడుపులో లేనిదే కౌగలించుకుంటే వస్తుందా ! ఏవో మందులు వాడేవారు. శానిటోరియంకు పంపే ప్రయత్నంలో ఉండగా, నన్ను దగ్గరికి పిలిచింది.

''రఘూ ! ప్రేమించే మనస్సుకి, ప్రేమించే మనస్సు అలభ్యమయితే, ఇదే గతికదూ !'' అంది ఆవేదనగా.

''ఏమిటో చెప్పు !'' అన్నాను.

''నేను ప్రేమించాను. రఘూ !'' అన్నది.

''అది సర్వసాధారణం. దానికి దిగులెందుకు ?'' అన్నాను.

''ప్రేమించట మంటే, మోహించటం, కాదురఘూ! కామించటంకాదు. ప్రేమ అన్నది పవిత్ర వస్తువు. ఆత్మగతమైనది. అందమైన వస్తువుని చూసి, ఆకర్షింపబడుతాం. అంటే, మోహితుల మవుతాం అన్నమాట ! తర్వాత దాన్ని మన చేతుల్లో అట్టే పెట్టుకోవాలని కాంక్షిస్తాం. అదే కామన ! కనకాంగిని, నేనూ ప్రేమించాను; అన్నయ్యా ప్రేమించాడు. అన్నయ్య ఆమె అందాన్ని అనుభవిస్తున్నా పరితృప్తుడవటంలేదు. నాకు ఆమె ఇంట్లో తిరుగుతూండగా చూస్తేనే, ఆనందంగా ఉంటోంది. కాని ఆమె ప్రేమా, ఆదరణ నాకు లభ్యంకాలేదు. స్త్రీ, స్త్రీ ప్రేమ కోరుకోవటం, విచిత్రంగా లేదూ ?''

''డెలీరియం కాబోల్ను. అని భయపడ్డాను.''

''నే నుండగా నీకేం భయం మణీ !'' అని దిగాలుగా అన్నాను.

''నువ్వే, మా అన్నయ్యయితే, నాకు భాతృ ప్రేమ కూడా క్షీరసాగరంలో అమృతంలా లభ్యమయ్యేది.'' కళ్ల నీళ్లూరు తూంటే అన్నది మణి.

గత కుక్క మన్నాడు. పద్మనాభం. మణి ! పరిమళ భరితమైన మల్లి పూవులోంచి విడిపోయి నేలరాలే సున్నిత మల్లిపూ రేకులా, జలజల్లాడుతూ ఎగిరి తమ ప్రాంగణంలోని మహా వృక్షాల క్రింద సేద తీరుతున్న అమృత మూర్తి !

''ఆ మాట, ఆ రూపూ, నా మనసులో చెరగని ముద్ర వేసుకున్నాయి. ఎంతమంది కుటుంబీకులు తమ మధ్య మెసలుతూన్న అమృత హృదయాల్ని కనుగొంటున్నారు ? అసలు లోటి హృదయాల్లోని నవనీత సారం గ్రహించకల్గే స్థిమితం ఎంతమందికున్నది ? ఎక్కడున్నా ఈ అన్నయ్యని మరిచిపోకమ్మా అన్నాను. తర్వాత కొన్ని రోజులదాకా ఉత్తరాలు వ్రాసేది. శానిటోరియంలో, రెండు సంవత్సరాలున్నది. తర్వాత ఇంటి కొచ్చేక, యం. ఎ.కు కట్టి పరీక్ష ప్యాసయినది. వివాహం శుభలేక తర్వాత మళీ ఉత్తరాలు వ్రాయలేదు. బహుశా అత్తవారింట తీరికలేదు కాబోలు అనుకున్నాను. మిమ్మల్ని చూసేక, ఎప్పుడు చూద్దామా అనిపిస్తున్నది.'' అన్నాడు.

అయితే ఇంతవరకూ మణి ఇతన్ని చూడలేదన్నమాట. రఘుకేసి దీర్ఘంగా చూసాడు పద్మనాభం. చామన చాయగా, పొట్టిగా ఉన్నాడు. మనిషి పొట్టి మూలంగా పీలగా అవుపించుతాడు. చురుకైన కళ్ళు. ప్రతీ చిన్న విషయాన్ని మనస్సుకి పట్టించుకునే సున్నిత వ్యక్తి !

''మిమ్మల్ని చూసానన్నదే మణి !'' అన్నాడు పద్మనాభం.

''మిమ్మల్ని మీరు పరిచయం చేసుకునేదాకా మణి వూరు ఈ వూరనే తెలియదు నాకు. అందుకనే, చూడాలనే ఆతృత కలిగింది. నాకు ! పదండి !'' అన్నాడు.

రఘునందన్‌దా అబద్ధం ! మణిదా ! ఎవర్ని నమ్మాలి! ఎవర్ని నమ్మకపోవాలి ! తనలో తనే మల్లా గుల్లాలు పడుతూ కారు దగ్గరకు నడిచాడు పద్మనాభం. రఘునందన్ వెళ్లిపోతూ.

"ప్రొద్దుటే వచ్చేస్తా ! వెళ్లాయిని చూట్టానికి. వాళ్ల వదినసీ, పిల్లల్నీ కూడా తీసుకవస్తానని చెప్పండి" అన్నాడు.

"తప్పకుండా రండి భోజనం మా ఇంట్లోనే !" అన్నాడు పద్మనాభం. అదృష్టవంతురాలు మణి ! అనుకున్నాడు రఘునందన్. ఆమె జీవితానికేం భయంలేదు. అన్నిటినీ భరించకల్గే హనుమంతుడు లాంటి భర్త దొరికాడు అని ముచ్చటపడ్డాడు.

రెండేళ్ల అనంతరం, రాత్రి పన్నెండయ్యాక, తనగది దగ్గర ఏదో అడుగుల చప్పుడికి మెలుకువ వచ్చింది మణికి. సన్నగా తలంపి దిక్కున మాత్రం బెడ్‌రూం లైట్ వెలుగుతూంది. మణి లేవలేదు. నీరసంగా అల్లానే పడివుంది. పద్మనాభం లోపలికి వచ్చి, లైట్ వేసాడు. రెండేళ్లనాడుకన్నా మణి ఇంకా చిక్కిపోయింది. పొడుగాటి జుట్టు మాత్రం దిండుఅంతా పరుచుకున్నది. వచ్చి మంచంమీద కూర్చుంటూనే ఆమె చెంపమీద చేయివేశాడు. తడి తగిలింది. అతని అరచేతికి.

"ఎందుకు వచ్చారు ?" అన్నది మణి శుష్కించిన స్వరంతో.

"ఎందుకని అబద్ధం చెప్పావు మణీ ! నా మీద నీకు కోపమా ?" రెండు చేతులతో భుజాలు పుచ్చుకుని లేవదీసాడు.

"కోపమని ఎల్లా అనుకున్నారు ?" నవ్వింది మణి హార్థికంగా.

"ఆ మనిషి దేవతా ! ఎల్లా నవ్వ గల్గుతోంది ! ఆ నవ్వులో ఆ శుష్కించిన పెదాల మీద విరజిమ్మే వెడనవ్వ వెన్నెలలా ఉన్న దేమిటి ?" దిగ్భ్రమగా చూసాడు మణి వెంపు.

"మీమీద కోపం దేనికి చెప్పండి ! నా కెవరిమీద కోపం రాదు. డాక్టరు, నా వూపిరితిత్తి ఒకటి పూర్తిగా చెడిపోయిందని చెప్పాడు. అందుకని మిమ్మల్ని దూరంగా ఉంచటానికి చిన్న ప్రయత్నం ! అంతే !" మణి నెమ్మదిగా, తాపీగా, అన్నది.

ఒక్కమారు రోదసిలోంచి, సముద్రంలోకి గిరాటెయ్య బడ్డట్టు్ల భావన వచ్చింది పద్మనాభానికి. కళ్లమ్మట నీళ్లొచ్చేయ్.

"అంతబద్ధ మాడతావా మణి ! ఇన్నాళ్లకైనా, రఘునందన్ కన్పించాడు కనుక సరిపోయింది. లేకపోతే ఎన్నేళ్ల ఇలా గడిచిపోనూ చెప్పు ! నా మీద నీకింత అవిశ్వాసమా ! మణి !"

"ఏదబద్ధం ! ఏది నిజం ! అబద్ధం కథ అయితే, నిజం జీవితం ! సగం అబద్ధం సగం నిజం కలిపితే, జీవితకథ, లేకపోతే కథలవంటి జీవితాలూ అవుతయి. అంతే !" కళ్లు మూసుకుని మాట్లాడింది మణి.

"రఘునందన్ కన్పించాడు. రేపొస్తాన్నాడు. అతనికి మన పెళ్లయ్యాక ఉత్తరాలు వ్రాయటం మానేసావటగా !"

"అతను వచ్చి రెండు సంవత్సరాలయింది." అన్నది.

"తెలుసునుకా ?' మరి వెళ్లి చూడలేక పోయావు ?" ఆపేక్షగా అన్నాడు.

"ఆసక్తి లేక !"

"ఆసక్తి ! అల్లాంటి మాటలు ఇంక అనకు మణి !'

"ప్రేమ మంచువంటిది. అది ఏ వ్యక్తిమీదా నిలవదు."

"అల్లా అంటున్నావేమిటి !"

"కాకపోతే ! మీరు సంధ్యనీ లలితనీ, ప్రేమించబోయారు. నన్నూ ప్రేమించబోతున్నారు."

"నిన్ను నిజంగానే ఈ రోజు ఈ క్షణంనించీ ప్రేమించటం మొదలెట్టున్నాను." మణిని గాఢంగా హృదయానికి హత్తుకోబోయాడు. మణి దూరంగా జరిగింది.

"ఇంకా నమ్మకంలేదా ?"

మణి ముఖం చేతుల్తో కప్పుకుంటూ.

"వద్దు వద్దు ! మీ ప్రేమ నేను భరించలేను. రెండో వూపిరితిత్తిలోనికి కూడా, వ్యాధి ప్రవేశించిందట !" అన్నది. అతను దేనికీ విచలితుడయ్యే దృషి కోల్పోయాడు. అంచేత దృఢంగా, "అమృతంపోసి బ్రతికించుకుంటాను మణి !' అంటూ చేతుల్లోకి తీసుకున్నాడు.

"నన్ను నువ్వు ఎంత గాఢంగా ప్రేమించావో అర్థం అయ్యింది మణి ! నీమీద నా ప్రేమ తొలగింప చేసుకునే యత్నంలో, నీ జీవితానికి కళంకం కూడా ఆపాదించుకున్నావు."

"మనం మనని ప్రేమించుకున్నంతగా ఇంక ఎవర్నీ ప్రేమించలేము. ప్రేమించా మనుకోవటం మన భ్రమ. ప్రేమ అనేది స్వార్థపూరిత మైనది. మన్ని, మన ఉదారతని సహన శీలతని ఇతరులు గుర్తించాలనే తాపత్రయానికి 'ప్రేమ' అనే నైలాన్ ముసుగు వేస్తున్నారు వ్యక్తులు !"

"నువ్వూ అంతేనా !"

"నాయొక్క సహన శీలతని మీరందరూ గుర్తించాలనే, తాపత్రయంలో నా జీవితపు విలువని కోల్పోయాను."

బాధగా అంటూ అతని వడిలో కళ్లు మూసుకుని పడుక్కుంది. నాగమణి. వేడిగా కాలుతున్న ఆమె నుదుర మీదకు వంగి, ముద్దుపెట్టుకున్నాడు పద్మనాభం !